


## కొవ్వలి నవలల్లో కొన్ని...

'కొవ్వలి' అనే పేరు తెలుగు నవలా ప్రపంచంలో ఒక తరం పాఠకులకు చాలా చిరపరిచితం. ముఖ్యంగా మధ్య తరగతి వారిలో పఠనాభిలాషను పెంచిన రచయిత శ్రీ కొవ్వలి లక్ష్మీనరసింహారావు. అరవైయ్యేళ్ళు నిండేనాటికి వెయ్యి నవలలు రాసిన ప్రతిభ ఆయనది. ఆనాటి పాఠకులనాడి తెలుసుకుని కళాత్మకంగా పాత్రల్ని మలుచుకుంటూ చమత్కారంగా కథని నడిపించేవారు. పెద్దలూ పిల్లలూ, ఆడవాళ్ళూ మగవాళ్ళూ విరగబడి చదివిన ఈ వెయ్యి నవలల్లో కొన్నింటిని ఆంధ్రభూమి మాస పత్రిక పాఠకులకోసం అందిస్తున్నాం. ఇది మూడవది.

"కార్యాలూ, కరామతులు మొదలయిన శుభకార్యాలూ, వేడుకలు, చేసుకుని ఆనందించే రోజులేనా ఇవి? దేశంలో కోట్లాదిగా ప్రజలు తినడాని కన్నము, కట్టడానికి గుడ్డా లేక మహాక్షోభను పొందుతూ ఉన్నారు. అనేక మంది విద్యాధికులు, నిరుద్యోగులై ఆకటి మంటలతో అల్లాడిపోతున్నారు. ఋణభారంతో కుంగిపోయిన భారతీయ రైతు సోదరులను చూస్తూ వుంటే కళ్లనీళ్లు గిర్రున తిరుగుతూ ఉన్నాయి. ఈ కాంగ్రెసు పోరాటంలో సంపూర్ణ విజయం చేకూరడానికి ప్రతి హైందవ సోదరుడూ సంఘీభావంతో అగ్నిబ గడానికయినా సంసిద్ధుడై ఉండాలి. నేటి భారత మాత తన పుత్రుల త్యాగ మును, కార్యదీక్షను పరీక్షింపనై ఉంది అని మహాత్ముడొకవయిపు నుండి రణభేరిని మోగిస్తూ ఉన్నాడు. దేశమిటువంటి క్లిష్ట పరిస్థితుల్లో ఉండగా మన పిల్ల పెళ్లికి తొందరొచ్చిందా రమా?" అని రామచంద్రం భార్యయైన రమాదేవిని తీక్షణంగా అడగ్గా ఆమె ఒక వేడి నిట్టూర్పు విడిచి-

"ఈడొచ్చిన పిల్లకు పెళ్లి చేయకుండా ఎంతకాలమని ఇంట్లో పెట్టుకుని ఉంటామండీ?" దీనంగా అడిగింది.

"ఎంతకాలమయినా ఉంటాం. వచ్చిన ఈడు మీద పడికొట్టదు గదా?"

"మనకు బాగుంటే చూసినవాళ్లకు బాగుండొద్దూ?"

"మన దేశం కోసం మనం బ్రతకాలిగానీ చూసేవాళ్లకోసం బ్రతుకు తామా? తెలుగుదేశంలో పుట్టిన మనం ఆ తెలుగుదేశం విపత్తులో ఉన్న ప్పుడు మనం దానికి సేవ చేయకపోతే ఎందుకు?"

"చెయ్యండి నేనొద్దనడంలేదు. ఇదివరకు సాలీనా అయిదువేల రూపా యల ఆదాయం వచ్చే భూములను, ఇల్లు వాకిళ్లనూ కాంగ్రెస్ కింద వెచ్చ పెడితే నేనేమయినా అన్నానా? నెలకయిదు వందలు వచ్చే ప్లీడరీ వృత్తికి రాజీనామా ఇచ్చినప్పుడు నేనేమయినా అన్నానా? ఒంటిమీద వొంటెద్దు నగలు-నాపీ, పిల్లవీ మీరీ దేశసేవ కోసం ధారపోస్తే నేనేమయినా అడ్డు పెట్టానా?"

"అడ్డుపెడితే ఎలా కుదురుతుంది?"

"అందుకు నేనేమీ అనను. చివరకు మనకు రోజు గడవడం కూడా దుర్ల భమయిపోయినందుకు కూడా నేను విచారించడంలేదు. మనరోజులిలా గన ఉన్నాయి కాబట్టి అంతా ఇలా జరిగిపోయిందే అనుకున్నానుగాని ఇంకేమీ అనుకోలేదు. మీరు చేస్తూవున్న దేశసేవకు ఫలితంగా అటువంటి చెప్పుకోవలసిన ఐశ్వర్యం రెక్కలొచ్చి ఎగిరిపోగా ఇప్పుడు ఉండడానికి పంచా, తినడానికి కూడూ, కట్టడానికి బట్టలు లేనటువంటి హీన దశ వచ్చి పడింది. కానియ్యండి. ఇందుకు కూడా నాకు చింతలేదు"

"ఇంతకంటే హీన దశ కూడా రావచ్చు."

"రాదు. ఇంతకంటే హీన దశ ఇంకెవ్వరికీ రాదు. అంత సిరిని వెళ్లబోసిన నేను దేశ సేవకుని ఇల్లాలినని చెప్పుకుంటూ ఇంటికొక చారెడు బియ్యం మంగా బిచ్చమెత్తుకుంటూ ఉన్నాను. ఎండకన్నెరుగని నా పిల్ల 'నేను దేశ సేవకుని కూతురు'నని చెప్పుకుంటూ నాతో సమానంగా ఎండలోనూ, వానల్లోనూ తిరుగుతూ ఉంది. ఇంత అవస్థ పడినా ఒక్కొక్క రోజు పస్తు తప్పడంలేదు. ఇంతకంటే హీన దశ ఇంకెప్పుడొస్తుంది? ఇంకెవరికొస్తుంది? పట్టిది. ప్రపంచంలో మనకంటే దీనులింకెవరూ లేరు. మనకు వచ్చినంతటి దీనదశ ఇంకెవ్వరికీ రాదు.

ఈడు వచ్చిన నా తల్లి యౌవనాన్ని మరుగుపరచుకోవడానికయినా కొంపలో ఒక్క వల్లెవాటులేదు. చిరుగుల పరికిణీ, చిరుగుల వల్లెవాటునూ వేసుకుని అది నాతో ఉదర పోషణకు ఇల్లిల్లూ ఎక్కడానికి వీధి వీధి తిరగ డానికి సిగ్గుపడుతూంది. కానియ్యండి. దేశం కోసం మన సర్వస్వమూ ధార పోసుకున్నాము.

దేశం కోసం తిండిలేక మలమల మాడిపోతున్నాము. ఇదంతా మనకు విధాయకమే నేను కాదనను. అయితే ఈడు వచ్చిన పిల్లనొక అయ్య చేతిలో పెడితే మన బాధ్యత తీరిపోవడమే కాకుండా ఈకూటికి పేదలమ యినప్పటికీ కుల సాంప్రదాయం నిలుస్తుంది కదా అని ఇలా అంటున్నాను. అంతకంటే మరేమీ లేదు"

"పెళ్లంటే సామాన్యంగా ఉందా? డబ్బు కావాలి, తగిన సంబంధం దొర కాలి. అన్నింటికంటే ముఖ్యంగా రోజు రావాలి"

"ఎప్పుడు పిల్ల పెళ్లి విషయం ఎత్తినా ఇలాగే అంటే ఎలాగునండీ?"

"దేశ పరిస్థితులు, మన పరిస్థితులు కొంచెం మారనియ్యి రమా"

"మన పరిస్థితులిక మారడమనేవి సర్వకల్ల. ఇక ఎప్పుడో దేశ పరిస్థి తులు మారతవికదా అని పిల్లకు పెళ్లి చేయకుండా ఉంటే ఎలాగు?"

"కట్నం కానుక లీయనిదే సంబంధాలు మాత్రం ఎలా కుదురు తాయి?"

"కట్నాలీయడము, భానుకు తగినవాణ్ణి తీసుకుని రాగలమన్న ధైర్యము నాకు పోయి చాలాకాలమయింది. మన కొండంత స్థితి ఎప్పుడయితే చితి కిపోయి మనం కూటిక్కూడా ఎప్పుడయితే లేని వాళ్లమయినామో అప్పుడో పోయింది. ఇహనిప్పుడటువంటి ఆశలేమీ పెట్టుకోలేదు. ఎవరయి నాసరే పురుషుడంటూ కనబడి పిల్ల కన్యచర వొదులుస్తే అదే పదివేలు"

"అందుకయినా తగినంత సావకాశమూ, తీరికా ఉండాలి. నాలుగు వూళ్లు తిరిగి నలుగురనూ వాకబు చేయాలంటారా? అక్కరలేదా? ఇప్పటి కాంగ్రెసు పనివల్ల నాకు వూపిరి విడవడానికయినా తీరిక లేకుండా ఉంది. దేశసేవ ముందు నాకు పిల్ల పెళ్లి ముఖ్యం కాదు"

"అన్నింటికీ అదే చెబితే ఎలాగునండీ? మళ్లీ రేపో మాపో మీరు వెళ్లి జైల్లో కూచుంటారు. ఇదివరకు మీరు రెండుసార్లూ రెండు సంవత్సరాలు జైలుకు వెళ్లినప్పుడంటే పిల్లకింకా అప్పటికి యుక్తవయస్సు రాలేదు కాబట్టి నేను తినీ తినకా ఆ పిల్లనెట్టుకుని ఏ అరుగుమీద పడుకున్నా రోజులు గడి చిపోయినాయి. ఈసారి మీరు జైలులోకి వెళ్లారంటే అలా ఎలా సాగు తుంది? పదిహేనేళ్ల యుక్త వయసులో ఉన్న ఈ పడుచుపిల్లనెట్టుకుని ఏ అరుగుమీద పడుకుంటాను? ఏ పంచను తల దాచుకుంటాను? నేనొక్క తేనూ అంటారా? నాకు తిన్నా గడిచిపోతుంది, తినకపోయినా గడిచిపో తుంది. నా గురించి నేనెప్పుడూ విచారించను."

"అయితే ఏం చేయనూ? దేశ సేవలో నిమగ్నమైపోయి ఉన్న నా మనసు ఇంకో పనిలోకి చొరబడదు."

"పోనీ ఒక పని చేయండి"

"ఏమిటది?"

"తిరపయ్యగారికీ మీకూ ఎక్కువ స్నేహం. ఆయనకు మీరంటే ఎక్కువ అభిమానమని కూడా చెబుతూ ఉంటారు"

"అవును. అయితే?"

"వారబ్బాయి భాస్కరం బిఎ చదువుకుంటున్నాడు. బాగా వుంటాడు. ఇహ స్థితిగతులంటారా? చాలా మంచివి. ఆయనకు మీయందున్న అభి మానానికి వారు మనకు డబ్బీయవద్దు, దస్కమీయనక్కరలేదు. సిరిని

**ఆంధ్రభూమి మాసపత్రికలో వస్తున్న శ్రీ కొవ్వలి లక్ష్మీ నరసింహారావుగారి రచనలపై కాపీరైట్స్ కొవ్వలివారి కుమారులవి. వారి అనుమతి లేకుండా వాటిని ఏ రూపంలో వాడుకున్నా కాపీరైట్ చట్టరీత్యా నేరం.**

కాంగ్రెసుకు ధారపోసి చితికిపోయి ఉన్న సంసారులని అయినా దయ దలచి మన భానుమతిని భాస్కరానికి చేసుకోవలసిందని బ్రతిమిలాడండి. అలా జరిగిననాడు ఇక మనమేమైపోయినా నాకు విచారంలేదు''

“అబ్బో... అది చాలా పెద్ద ఆశ. మనలాంటి కూటికిలేనివాళ్ల సంబంధము ఆయన కొడుక్కు చేసుకుంటాడా? ఇప్పుడా కొడుక్కు ఏ అయిదు వేలో ఆరువేలో కట్నం రావాలని అతడు కూర్చుని ఉంటాడు.''

“తిరపయ్యగారు కూడా మీతోటి కాంగ్రెస్ సేవకుడే కాబట్టి మనకీ మాత్రం ఉపకారం చేయమని బ్రతిమాలండి. మహాత్ముని ఆజ్ఞలను పాటించే అతనిలాంటి దేశ సేవకుడికి ఈమాత్రం పరమార్థం ఉండడం విధి అని చెప్పండి''

“లాభముండదు రమా. అతనికి మనమీద ఎంత అభిమానముంటే మాత్రం వచ్చేదానిని పోగొట్టుకుంటాడా? కోరిన కట్నాలిస్తామంటూ అనేక మంది వస్తూ ఉన్నారు''

“అయినప్పటికీ మన పిల్లను చేసుకోవడంలో ఉండే పారమార్థికం మరో పిల్లను చేసుకుంటే ఉండదని నచ్చచెప్పాలి. ఒకప్పుడు తనకంటే వెయ్యిరెట్లు గొప్ప స్థితిని కలిగిన మనం ఆస్తినంతటినీ దేశం కోసము, కాంగ్రెస్ కోసము ధారపోసి ఇప్పుడు కూటికి గుడ్డకూ కూడా మొహం వాచి వున్న మన పిల్లను చేసుకుంటే భగవంతుడు మెచ్చుగలడని నచ్చచెప్పండి''

“ఏమో?''

“కట్నం రూపాయల కోసం ఆశించడానికి లేనివాడుగాడు. ఉన్నవాడు ఒక్కడే కొడుకు. మన భాను అతనికి చక్కని ఈడు, మంచి జోడు. ప్రపంచంలో మిగిలిపోయేది ఇటువంటి ధర్మకార్యమొక్కటేనని ఆయనకు మీరు బోధించండి. మరికొందరి చేత కూడా చెప్పించండి.''

“రమా! నీ పిచ్చిగానీ డబ్బుతో పని ఇది. మనకెందుకూ అటువంటి ఆశలు? మనమెప్పుడో సిరిమంతులమని ఇప్పుడే పేదలమై ఇప్పుడు నిరుపేదలమై ఉన్న మన పిల్ల నాశ్రీమంతుడు తన కొడుక్కు చేసుకుంటాడా? ప్రస్తుతం మన తాహతెక్కడ? అతని తాహతెక్కడ?''

“అన్నీ మనమే అనుకుంటే ఎలాగూ? ప్రయత్నం చేసినందువల్ల పోయిందేమీ లేదుకదా. మీరు ముందుగా అతనితో ఈ ప్రస్తావన ఎత్తి చూడండి. అతని అభిప్రాయము తెలుసుకున్న అనంతరం నేనాతని భార్యను కలుసుకుని కడుపూ కాళ్లు పట్టుకుని బ్రతిమిలాడుతాను''

“సరే అలాగే చేద్దాము. ఇహ నేను బయటకు వెళతాను. ఈ పూట ఏమయినా వంట ప్రయత్నముందా? నిన్నటిలాగునేనా?''

“అక్కరలేదు. ప్రొద్దుట నేనూ భాను వెళితే డాక్టర్‌గారి భార్య ఏ కళనుందో ఓ సేరు బియ్యమిచ్చింది'' అని భార్య చెప్పగానే క్రితంరోజుకు వలెనే పస్తువుండనక్కర్లేదుకదా అని సంతోషించిచ రామచంద్రం బయటకు వెళ్లిపోయాడు. ఇంతలో భానుమతి నాలుగు అరటికాయలను చేత్తో పట్టుకుని వచ్చింది.

“అమ్మా! పొరుగింటి వారింటికి వెళితే కూర వండుకోమని ఈ నాలుగు అరటికాయలూ ఇచ్చారే. వేపుడు చేయడానికి నూనెలేదు కాబోలు''

అని అంటూ ఉంటే ఆ తల్లి ప్రాణం నీరయిపోయింది. రమాదేవి, భానుమతిని దగ్గరకు తీసుకుని ఒక వేడి నిట్టూర్పు విడిచి-

“ఎటువంటి భోగములను అనుభవించినవారికెటువంటి గతి కలిగినదే తల్లీ! నీ మనసుదీరా వేపుడు చేసి పెట్టడానికి ఇంట్లో నూనె లేకపోయినా? అయ్యో భారతమాత మనలనెన్ని విధాల పరీక్ష చేస్తున్నదే తల్లీ'' అని అంటూ ఉండగా ఆమె కంఠం శోకంతో పూడుకుని పోయింది. భానుమతి తల్లియొక్క హృదయవేదనను గమనించింది.


అమ్మా! పడ్డ గోడలు పడ్డట్లే ఉంటాయిటే? ఒకవేళ కాంగ్రెసు నాయకులు ఎన్నికలలో పాల్గొనే రోజువస్తే నాన్నగారికి ఏ మంత్రి పదవి అయినా రాకపోదు. అప్పుడు మన కష్టాలు గట్టెక్కవూ?'' అని భానుమతి అనగా కూతురుయొక్క సహనగుణము ఆ తల్లి ప్రాణం లోలోపలనే అభినందించుకుంది.

★★★



## ప్రియమణి కోరిక!

ప్రియమణిలో అద్భుతమైన నటి దాగి వుందన్న విషయం అందరికీ తెలిసిందే. అంతేకాదు, జాతీయ స్థాయిలో ఉత్తమ నటి అవార్డును కూడా అందుకుంది. అయినా ఆమెలో అసంతృప్తి... కారణం ఏమిటని ఆరా తీస్తే 'నేనెన్నో క్యారెక్టర్లను ధరించాను. నేనింతవరకూ లేడి ఓరియెంటెడ్ పాత్ర ధరించలేదు. ఇంతకుముందు ఎంతోమంది లేడీ ఓరియెంటెడ్ పాత్రల్లో నటించి మెప్పించారు. వారి సరసన నేనూ నిలబడాలనుకుంటున్నాను' అంటూ తన మనసులోని మాటను చెప్పింది ప్రియమణి. ఆమె కోరిక అతి తొందరలో తీరాలని మనం కూడా మనసారా కోరుకుందాం!



"భగవంతుడు జానెడు పొట్ట నొకదానిని కల్పించి జీవరాసులన్నింటినీ నానా హింసలూ పెడుతున్నాడు."

"అది లేకపోతే ఇక ప్రపంచమేలేదు"

"కడుపు, ఆకలి అనేవి లేకుండా ఉంటే మనకీ తాపత్రయాలేవీ ఉండవు కదా. తెల్లవారిందీ అంటే అదే జిజ్ఞాస, అదే ప్రయత్నం. అందుకే అప్రమాణాలు, అసత్యాలు."

"అంతేమరి. ఈ వెధవ పొట్టకోసం అనేక మోసాలు చేయాలి, మాదర్చోదీలు చేయాలి."

"చేయకపోతే రోజు గడవదుగా?"

"ప్రపంచంలో పుట్టిన ప్రతి ప్రాణికీ కూడా ఇదే వరస"

"కాదు. తేడావుంది. పక్షులు మొదలైనవాటికిన్నీ ఆకలి వుందే అనుకో. అయితే నరులకున్నంతటి గొడవ వాటికిలేదు. చీకటిలోనూ బయలుదేరుతాయి. ఆ చెట్టుమీద ఒక కాయి, ఈ చెట్టుమీద ఓ గింజ, ఆ చెరువులోని నీళ్లు, ఈ గుంటలోని నీళ్లు తాగి సాయంకాలంవరకూ హాయిగా విహరిస్తాయి. అవి ఇచ్ఛాజీవులు. మనలాగ సంపాదించాలి, దారాపుత్రులను పోషించాలి, బట్టలు కావాలి, కాఫీలు కావాలి, బీడీలు, తాగుడు కావాలి... మొదలైన జిజ్ఞాస వాటికి లేవు చూడు."

"ఏమిటో మనం అలా అనుకుంటాముగానీ వాటికి తగ్గా జిజ్ఞాస వాటికీ వుంది. ఉదయం లేచింది మొదలుకుని రాత్రి పడేవరకు ఈ ఆకలిదప్పీ అనే జిజ్ఞాస వాటిక్కూడా ఉందే అనుకో"

"ఉందిలే. కానీ మనకున్నవి గొడవలు వాటికి లేవు. అవి ఇచ్ఛాజీవులు. ఒక్క తిండితోనే మనకు సరిపోతుందా? మనిషి బతకాలీ అంటే ఎన్ని కావాలి?"

"కావాలి. వాటిల్లో చాలా భాగం మనం తెచ్చిపెట్టుకున్నవే. కోరికలు ఎక్కువవుతూ వున్నకొద్దీ మనిషి యొక్క ఆర్థిక పరిమాణం ఎక్కువవుతూ ఉండాలి. బీడీలు, తాగుడు, కాఫీ మొదలైన లగ్జరీస్ ఎన్నో మనం తెచ్చిపెట్టుకున్నవే. అవి మనం బ్రతకడానికేగానీ అవసరములకుకావు. పక్షులు మొదలైన వాటికీ మనకూ ఉన్న తేడా అంతే. వాటికి అవసరంలేని ఆడంబరాలెన్నో మనకు కావాలి. అవి ఎక్కువయినకొద్దీ మనకు జిజ్ఞాస ఎక్కువవుతూనే వుంటుంది"

"ఇంతకూ చెప్పొచ్చే మాట ఏమిటంటే సంసారము, భార్యాపిల్లలను వదిలేసినా నన్ను నేను పోషించుకోలేకుండా ఉన్నానోయ్. చివరకు ఏమీ తోచక ఖద్దరు బట్టలు జమాయించి కాంగ్రెసువాలాకింద తయారయినాను తిరపయ్యా!"

"ఉండి ఉండి బహు మంచి యెత్తు ఎత్తావురా మారయ్యా"

"ఎత్తాను మరి. నీలాగునే అనేకమంది ఈ ఉద్యమంలో బాగుపడడము చూస్తున్నాము. అందువల్ల నాక్కూడా ఏమయినా పని జరుగుతుందేమోనని ఈ వేషం వేసాను. ఇహనయినా నా జాతకం మారుతుందో ఇలాగే వుంటుందో మరి."

"అక్కర్లేదు. ఖద్దరు బట్టలో వున్న మహిమ క్రమంగా నీకే తెలుస్తుంది. అయితే ఇప్పుడు నీ భార్యాబిడ్డలు ఎక్కడున్నట్లు?"

"మా అన్నయ్యగారింటి దగ్గర కాకినాడలో దిగవిడిచాను. అంతా ఆరు మాసాలయింది. ఏం చేయను? నన్ను నేనే పోషించుకోలేకుండా ఉంటే వాళ్లను కూడా ఎక్కడ పోషించగలను. అందువల్ల వాళ్లనక్కడ దిగబెట్టి నేనీ ఆరుమాసాల నుంచీ అక్కడా ఇక్కడా కాలక్షేపం చేస్తూ ఉన్నాను."

"మీ అన్నగారి పరిస్థితి ఏమైనా కాస్త బాగా ఉందా ఏమిటి?"

"ఏం బాగుండడంలే. వాడికి కలెక్టర్ ఆఫీసులో నెలకు ముప్పైరూపాయలు వస్తాయి."

"గవర్నమెంటు నౌఖరీ వుంటే రెగ్యులర్‌గా ఎంతో కొంత వస్తూ వుంటుంది. కలో, గంజో తాగి పడి వుండవచ్చు."

"అలాగే మరి"

"అయితే నిన్ను గురించి నేనింకో మాట విన్నాను. వట్టిదో నిజమో!"

"అడిగేసెయ్యి ఏమిటదీ?"

"కోపం తెచ్చుకోవుకదా"

"అక్కరలేదు. మన ఇద్దరకూ అటువంటి తేడా ఏదిన్నీలేదు"

"ఏమీలేదు. ఈ వూళ్లో నీకెవరో మనిషితో సంబంధముందనీ, అందువల్ల నువ్వు భార్యాబిడ్డలను మీ అన్నయ్యగారింటి దగ్గర వొదిలేసి ఇక్కడ ఉంటున్నావని ఒకరిద్దరు చెప్పుకుంటూ ఉండడం విన్నాను. నేనిలా అడుగుతున్నామని ఏమీ అనుకోకు"

"నేనొక మాట చెబుతాను వినబ్బాయి. కిట్టనివాళ్లు అనేకమంది అనేక విధాలుగా చెప్పుకుంటూ ఉంటారు. మనమటు వంటి వాటిని లెక్క చేసుకోకూడదు."

"అంతేనా? నేనూ మొదట అలాగే అనుకున్నాను. కానీ తెలిసిన విషయమును నిన్నే అడిగేస్తే నిజం తెలిసిపోతుందన్న ఉద్దేశ్యంతో అడిగాను."

"ఆహా...అడిగితే తప్పేముంది? నేను కాస్త పోకుగా వుంటూ ఈమధ్య మావాళ్లను కాకినాడలో దిగబెట్టి రావడంవల్లనూ, స్వేచ్ఛగా ఉంటూ వుండడమూ చూసి ఎవరో గిట్టనివాళ్లు అగావును వేసి వుంటారంతేగానీ మరేమీ లేదు. ఏదయినా ఉంటే భయమేమిటి? అందులోనూ నీ దగ్గర దాస్తానా?"

"ఇంతకూ రోజులు మంచివిగావయ్యా! నన్నెంతమంది ఎన్నివిధాల అనుకోవడంలేదూ? కాంగ్రెసు డబ్బు అపహరించాడనీ, కాంగ్రెస్ వచ్చాక మేడలూ మిద్దెలూ కట్టుకున్నాడనీ... ఇలా ఎవరికి తోచినట్లుగా వారనుకుంటూ ఉంటారు. వాటికి అర్థమేమిటి?"

"గాకపోయినా మాటలు గాలికి పోతాయి. కొందరు తాము బాగుపడనూలేరు. ఎదుటివారు బాగు పడుతూ ఉంటే చూడనూ లేరు"

"అశక్తత, దుర్జనత్వమూను"

"అంతే. ఇదీ ఇప్పటి ప్రాపంచిక నైజం!"

"మాటలను లెక్క చేసుకుంటే మనమసలే ఈ ప్రపంచంలో బ్రతకలేము"

"ఇంకెందుకు తిరపయ్యా! నీతో కూడా ఉంటూ ఉంటాను. నేను కూడా పదిమందికి చెప్పి ఓ కాంగ్రెస్ మనిషి కింద వాళీపడేట్లు చెయ్యి"

"ముఖ్యంగా అలాగే చేస్తాను మారయ్యా. నీకు ధన సహాయం చేయలేకపోయినప్పటికీ మాట సాయం చేయడంలో వెనుదీయను"

"ప్రస్తుతం నాకు కావలసిందీ అంతే"

"నాకంటే కూడా నీకీరోజుల్లో ఎక్కువగా ఈ ఖద్దరు బట్ట ఉంది చూసావూ అది మహోపకారం చేస్తుంది. దానివల్ల లేని గౌరవమేర్పడుతుంది. అది లేదన్న వాళ్లచేత ఇప్పిస్తుంది. మనలో మన మాట ఇంకొటి చెబుతున్నాను. మనమెటువంటి కాని పనులు చేసినప్పటికీ ఈ ఖద్దరు బట్ట వుంది చూసావూ అది వాటినన్నింటినీ కాపాడగల కవచమవుతుంది."

"నేనూ ఆ మాటనే విన్నాను. అందుకే ఈ వేషం వేసాను."

"బాగుంది. ఇక ఖద్దరు టోపీ కూడా ఒకటి తగిలించుకున్నావు అంటే నువ్వు కూడా ఒక దేశ సేవకుడిలా పరిగణింపబడగలవు. అప్పుడిక నువ్వు ఎక్కడకు వెళ్లినా ఏమీ లోటుండదు."

“ఏదో కొంతకాలం నీతో తిప్పుకుంటూ ఇటువంటి ఉపదేశాలు చేసానంటే నీ పేరు చెప్పుకుని బ్రతుకుదెరువు నేర్పర్చుకున్నవాడినవుతాను”

“ఊ... ముఖ్యంగా అలాగే” అని మారయ్య, తిరపయ్యలిద్దరూ మాలాడుకుంటూ ఉండగా అక్కడకు రామచంద్రమొచ్చాడు.

“ఓహో కాంగ్రెస్ సెక్రటరీగారా! దయచేయండి” అని అంటూ తిరపయ్య తమ ఇంటికొచ్చిన రామచంద్రమును ఆహ్వానించి కూర్చోబెట్టాడు.

“ఈ మహాశయులెవరూ?” అని రామచంద్రం మారయ్యను చూసి అడిగాడు.

“వీరు మారయ్యగారని మంచి స్థితిమంతులు. ఈమధ్యనే దేశసేవ చేయడానికి కంకణం కట్టుకుని కార్యరంగంలోకి దిగారు.”

“ఓహో...అలాగా. చాలా సంతోషం” అని అంటూ రామచంద్రం మారయ్యకు షేక్‌హ్యాండ్ ఇచ్చాడు. తిరపయ్య తన్ను గురించి చాలా గొప్పగా చెప్పాడని మారయ్య సంతోషించాడు. తరువాత తిరపయ్య రామచంద్రము గురించి మారయ్యకు ఈ విధంగా తెలియజెప్పాడు.

“వీరీ నగరంలో కాంగ్రెస్ సెక్రటరీగా పని చేస్తున్నారు. త్యాగధనులు. సుమారు పది పదిహేను సంవత్సరాల నుంచి ఈ ఉద్యమానికి సర్వస్వమును ధారపోసారు. నెలకు అయిదారువందలు సంపాదించుకునే ప్లీడరీ వృత్తికి రాజీనామాను చేసారు.”

“ఆ..అదేమీ అంత లెక్కలోనిది కాదులెండి. నాకంటే అనేకమంది ఎక్కువ త్యాగమును గావించినవారున్నారు. ఎంతమంది ఎన్ని విధాలా త్యాగం చేయకపోయినట్లయితే ఇహ దేశానికి విముక్తి ఎలా కలుగుతుంది? ఎవరికి వీలయినంత మట్టుకువారు దేశానికి సేవ చేయడం కంటే వేరు కర్తవ్యమేదిన్నీలేదు” అని రామచంద్రం చెబుతూ ఉంటే-

“మనం మన అర్థప్రాణాలను దేశంకోసం ధారపోయడానికే ఉన్నాము” అని తిరపయ్య అన్నాడు.

“ప్రతి దేశీయుడూ తన కర్తవ్యంకోసం అదేనని భావించిననాడు మనకు స్వరాజ్యం తప్పక వచ్చి తీరుతుంది” అని మారయ్య చెప్పినదానిని తిరపయ్య సమర్థించాడు.

“వచ్చేనెలలో మహాత్ముడు తిరిగి సహాయ నిరాకణోద్యమాన్ని ప్రారంభింపనై ఉన్నాడు. అప్పుడు మనమందరమూ ఎన్న అవదలు వచ్చినా వెనుదీయకూడదు. జైళ్లల్లోకి వెళ్లడానికయినా, లాఠీ దెబ్బలు తినడానికయినా సంసిద్ధులమై ఉండాలి. ఈ విషయమును గురించి హెచ్చరించడానికే ఇప్పుడు నేను మీ ఇంటికి వచ్చినది కూడాను” అని రామచంద్ర అనగా-

“మీరు వచ్చేముందు మేము కూడా ఇదే మాటను అనుకుంటూన్నాము. కదుటండీ సూరయ్యగారు” అని తిరపయ్య మారయ్యను అడగ్గా-

“అవును. ఆ విషయం గురించే మాటలాడుకుంటూ ఉన్నామండీ” అని మారయ్య అతను చెప్పినదానిని సమర్థించాడు.

“ఇంకొక విషయం ఏమిటంటే ప్రస్తుతం కాంగ్రెస్‌కు చందాదారులను వీలయినంత ఎక్కువమందిని చేర్పించవలసి ఉంటుంది. పావలా చందాదారులనెందరినో చేర్పించాలి.”

“అవును. అది అవసరమే. ఆ పనిని మన మారయ్యకు పురమాయించండి”

“ఇదిగో రశీదు పుస్తకాలు. తరువాత కనీసం మన గ్రామంలో రోజుకు ఒక పాతికమంది చందాదారులనయినా చేర్పించారంటే మంచి పని జరిగినట్లే” అని రామచంద్రం తన దగ్గరున్న కొన్ని రసీదు పుస్తకాలను మారయ్యకిచ్చాడు.

“పాతికమందేమిటండీ. ఘట్టిగా ప్రయత్నం చేసామంటే రోజుకు యాభైమందిని కూడా చేర్పించవచ్చును” అని మారయ్య ధీమాగా చెప్పడంవల్ల రామచంద్రం చాలా సంతోషించి-

“తమలాంటి కార్యశూరులయిన దేశ సేవకులు నేడు అత్యధికంగా కావలసి ఉన్నారు?” అని చెప్పి అతన్ని మరికొంతసేపు హెచ్చరించిన అనంతరం రామచంద్రం అక్కడ నుంచి వెళ్లిపోయినాడు. అతనలా వెళ్లిపోగానే అతనిని గురించి తిరపయ్య, మారయ్యతో ఈ విధంగా చెప్పాడు.

“ఉట్టిచవట. సాలీనా పొలాలమీద అయిదువేల రూపాయలు వచ్చేవి. ప్లీడరీ ప్రాక్టీసువల్ల నెలకు నాల్గైదు వందలు వచ్చేవి. ఈ నిర్భాగ్యుడు వాటినన్నింటినీ కాంగ్రెస్‌కింద వెచ్చబెట్టేసి ఇప్పుడు పెళ్లాంబిడ్డలను పోషించలేని దుస్థితిలో ఉన్నాడు. ఎదిగిన పిల్లకు పెళ్లి చేద్దామంటే చేతిలో కాని డబ్బాయినా లేకుండా ఉన్నాడు.”

“అయితే నా స్థితిలోనే ఉన్నాడన్నమాట.”

“అతనికంటే నువ్వు చాలా నయం. ఏ ఎండకా గొడుకు పట్టి ఏ యాటకా తాళంవేసి కాలక్షేపం చేయగలవు. అతనికా బ్రతుకుదెరు వున్నా చేతకాదు. నిజాయితీ అని, సత్యవాదిననీ, పేరు కోసం పాకులాడి కొనకు చేతికి చిప్పను తెచ్చుకున్నాడు.”

“ఖర్మం”

“సరే అతని గోల మనకెందుకు? ప్రస్తుతం నీకు పని జరిగింది. ఈ చందాల పుస్తకం పట్టుకుని బయలుదేరవూ అంటే కనీసం రోజుకు ఏ ఇద్దరు ముగ్గురయినా చందాదారులుగా చేర్చకపోవు. దానితో నీకు పూచీ గడిచిపోతుంది.”

“ఇంకేం కావాలి? నువ్వు నాకు ఉపాధిని కల్పించిన వాడవయినావు. అయితే ఈ చందా సొమ్మును కాంగ్రెస్‌కు జమ కట్టించాలంటారేమో”

“నేను చెబుతానుగా. నీకా గొడవ అక్కర్లేదు. ప్రస్తుతం ఇబ్బంది పడకుండా గడుపుకొందూ” అని తిరపయ్య, మారయ్యను ఈ విధంగా తర్ఫీదు చేసాడు. ఇటువంటి దొంగ దేశ సేవకులవల్ల దేశానికెంతటి అనర్థకం కలుగుతుందో ఎవరూ గమనించరు!

★★★

“ఏమండీ బావగారూ! మీ తమ్ముడుగారి దగ్గర నుంచీ ఏమీ ఉత్తరం రాలేదుగదా!”



"లేదమ్మా"

"చూసారా! ఆరుమాసాలుగా మమ్మల్ని ఇక్కడ పడేసి తాము అక్కడా అక్కడా తిరుగుతున్నారు."

"ఏం చేయను? అక్కడకూ నాలుగు ఉత్తరాలు రాసాను. ఒక్కదానికీ జవాబు రాసాడుకాడు. ఇదివరకెప్పుడైనా ఉత్తరం రాస్తే జవాబు రాసేసాడు. ఇప్పుడదీ కూడా మానేసాడు."

"ఇప్పుడింతకూ వారే వూళ్లో ఉన్నట్లు"

"బందరులో వున్నాడుట. ఆమధ్యనెవరో ఒక కాంగ్రెస్ ప్రచారకుడు వచ్చి చెప్పాడు. ఇప్పుడు మారయ్య స్వదేశీ ఉద్యమంలో తీవ్రంగా పని చేస్తూ ఉన్నాడట"

"ఆ పని మీకేమైనా బాగుందా? భార్యాబిడ్డల గతి కనుక్కోలేనివాళ్లు దేశానికి సేవ చేసి ఉద్ధరిస్తారా?"

"అసలైన మాట అన్నావు. నువ్వు చెప్పినదానిని నేను కాదనను. అయితే వాడు నాకు తమ్ముడయినప్పటికీ చిన్నవాడుగాడు, చితకవాడు కాదు. పాతిక సంవత్సరాలు నెత్తికొచ్చాయి. వాడిని ఏమనను?"

"మీరు ఉన్నారు కాబట్టి ఈ ఆరుమాసాలు ఆదరించారు. లేకపోతే నేనూ ఈ పిల్లలు ఏమయిపోవాలి చెప్పండి. కూటికిలేనివాళ్లు భార్యాబిడ్డల కడుపులు మాడ్చి వాళ్లను ఉసురుబెట్టి దేశసేవ చేయవలసిందని మహాత్ముడు చెప్పాడా? ఆలుబిడ్డల కష్టమునే తొలగించి వాళ్లకింత తిండి పెట్టలేనివాళ్లు దేశానికేం సేవ చేస్తారండీ? చేసినా అది ధర్మమా? న్యాయమా?"

"మహాత్ముడెప్పుడూ అలా చెప్పి ఉండడు. పెళ్లాం బిడ్డలను మాడ్చుకుని దేశసేవ చేయవలసిందిగా ఎవ్వరూ చెప్పరు. తగిన సాగుబాటున్న వాళ్లు దేశ సేవ చేయడానికి అర్హులు. తనకు తాను సేవ చేసుకోలేనివాడు దేశ సేవ చేయడమనేది నగుబాటు."

"ఇలా ఎంతకాలమని మేమిక్కడ పడి వుంటాము? మీరయినా సాధారణ సంసారులుగాని, ఎక్కువగా ఉన్నవారు కాదుకదా. అందులోనూ ఈ రోజుల్లో ఒక మనిషిని ఇంకో మనిషి ఎత్తి పోషించడం ఎంత కష్టం"

"ఫర్వాలేదమ్మా. నువ్వలా ఎప్పుడూ అనుకోకు. ఉన్నదానిలోనే ఇంత గంజి కాచుకుని తాగుదాము. ఆ మారయ్యగాడలా అయిపోయినప్పుడు మనమేం చేస్తాము? వాడికాదినుంచీ సంసారం మోయలేదు. ఉన్న కొంప ఒక్కటీ అమ్మేదాకా పేచీ పెట్టాడు. దానినయినకాడికి తెగనమ్మి వాడి వాటాకొచ్చిన వెయ్యి రూపాయలూ, వెంటనే వాడికే ఇచ్చేసాను. ఆ డబ్బు చేతికొచ్చిన రెండో సంవత్సరమే చేతిలో చిల్లిగవ్వ లేకుండా చేసుకున్నాడు. వాడి చేతికొచ్చిన డబ్బు అదేమిటో మట్టి అయిపోతుంది."

"ఇక ఇది పనిగాదు బావగారూ! ఇక్కడ ఇలా ఎంతకాలమున్నా వారూరుకుంటారు. వారికి వొదిలిందల్లా మంచి మాట. అందువల్ల నేనూ పిల్లలు బందరు పోయి కూర్చుంటే తీరిపోతుంది."

"ఏమోనమ్మా. మీరు వెడితే చిక్కులు పడతారేమోనని ఆలోచిస్తున్నాను. వాడు సరిగా చూడకపోయినట్లయితే పిల్లలతో అవస్థలు పడొద్దూ?"

"పడితే పడతాము. తప్పుతుందా ఏమిటి? ఎంతకాలమని మీ నెత్తిమీద కూర్చుని తింటాము?"

"పోనీ ఇంకో కొంతకాలం చూడమ్మా. అప్పటికి కూడా వాడు మార్గంలోకి రాకపోయినట్లయితే అలాగే చేద్దువుగాని"

"మీరు కాబట్టి అలా అంటున్నారు. ఇంకొకరయితే అలా అంటారూ? ఈ రోజుల్లో ఎక్కడి తమ్ములు? ఎక్కడి బంధువులు? అందులోనూ తమ్ముడి సంసారాన్ని ఇంట్లో పెట్టుకుని నెలల తరబడి ధర్మాత్ములు కాబట్టి మీరు పోషిస్తున్నారు. లేకపోయినట్లయితే మేమేమయిపోవాలి?"

"ఎల్లకాలమూ వాడు మాత్రం అలా ఉంటాడా ఏమిటమ్మా? ఏదో కొంతకాలం ఈ విధంగా సంసారం మోయకుండా తిరుగుతాడు. కొంతకాలానికయినా దారిలో పడకుండా ఉండడు."

"మీరలా అంటారుగానీ నాకటువంటి నమ్మకమేదిన్నీ లేదు. పాతిక సంవత్సరాలు గడిచాయి. ఇద్దరు ముగ్గురు పిల్లలను కన్నారు. వారికిప్పుడే సంసారం మోయకపోయినట్లయితే ఇంకెప్పుడు మోస్తుంది చెప్పండి. కాంగ్రెస్‌లో పని చేస్తూ ఉన్నవాళ్లూ ఉన్నారు. దేశానికి సేవ చేసినవాళ్లూ ఉన్నారు. అయితే ఎవరయినా ఈ పద్ధతిలో ఉన్నారా? ఇంకా ఈ ఉద్యమమొచ్చాక బోలెడన్ని ఆస్తులు సంపాదించి బాగుపడిన వాళ్లున్నారు. మా బందరులో తిరపయ్యగారని ఒకాయన ఉన్నాడు. ఆయనకు మొదట్లో తిండికి లేదు. ఈ కాంగ్రెస్ ఉద్యమమొచ్చాక పాతిక ఎకరాలు పొలం కొన్నాడు. బందరులో బ్రహ్మాండమైన రెండు మేడలు కొన్నాడు. కొడుక్కు బిఎదాకా చదువు చెప్పించాడు. భార్య మెడ తిరక్కుండా వస్తువులు దిగేసుకుంది."

"అందులో చెడిపోయినవాళ్లు మాత్రం లేరూ?"

"లేకనేం? అటువంటివాళ్లూ ఉన్నారనుకోండి. ఎందాకానో ఎందుకూ? మా ఊళ్లోనే రామచంద్రంగారని ఒకాయన ఉన్నాడు. ఆయనకు భూములమీద సాలీనా అయిదువేల రూపాయలు వచ్చేవి. ప్లీడరీ వృత్తివల్ల నెలకు నాల్ugైదువందలు వచ్చేవి. ఈ స్వదేశీ ఉద్యమంలో దిగి మొదట ప్లీడరీ వృత్తికి రాజీనామా ఇచ్చాడు. తరువాత క్రమంగా తనకున్న యావదాస్తినీ, కాంగ్రెస్‌కనీ, దేవసేవకనీ వెచ్చబెట్టేసి ఇప్పుడు చేతిలో కానిడబ్బయినా లేకుండా భార్యాబిడ్డలతో కటకటలాడిపోతున్నాడు. అతని భార్య రమాదేవి బహు ఉత్తమురాలు. పెద్ద పెద్ద బనారసు చీరలు,జరీ ముద్దలు నాలుగేసి అయిదేసి వందల రూపాయల ఖరీదు చేసే చీరలన్నింటినీ భర్త దహనం చేస్తుంటే కళ్లారా చూస్తూ ఊరుకుంది."

"వారన్నమాటేమిటి? ఆమధ్య విదేశీ వస్త్ర దహనమంటూ ఇలాగే బళ్లకొద్దీ బట్టలను తగలేసుకున్నారు."

"ఇప్పుడా ఇల్లాలు నిజంగా చెప్పుకోకూడదు. అంత సిరిని అనుభవించినదీ కూడా ఇల్లిల్లూ అడుక్కుంటూ ఉంది."

"విధి, కర్మసూత్రము నెవరూ తప్పించలేరు. మా మారిగాడు ఇప్పుడు నువ్వు చెప్పిన రెండు పద్ధతులలోనూ చేరడు. వాడు మొదటి నుంచీ ఏర్పాయిగా తిరిగి ఇప్పుడు కేవలం పొట్ట గడుపుకోవడం కోసం ఈ ఉద్యమంలోకి దిగాడు."

"ఆ ఉద్యమంలో దిగితే మాత్రం పొట్ట గడుస్తుందా అని నాకు సందేహం?"

"ఒక్కటేకదా. ఖద్దరు బట్టలు వేసుకుని అక్కడా ఇక్కడా తిరుగుతూ వాళ్లనూ వీళ్లనూ ఆశ్రయిస్తూ ఉంటే ఏదో ఒక్క పొట్ట గడువకపోదులే"

"పురుషుడై జన్మించాక ఇదేనా ప్రయోజకత్వం?"

"భగవంతుడు ఒక్కొక్కరికి ఒక్కొక్కవిధంగా పుట్టిస్తాడు దానికేం చేస్తాము?"

"సరే ఇప్పుడింతకూ నన్నూ పిల్లలనూ బందరు పంపెయ్యడం విషయంలో మీరేమంటారు?"

"ఇంకో కొంతకాలం చూద్దామంటున్నాను. ఈలోపుగా వాడికి ఉత్తరాలు రాస్తూ ఉందాము. వీలయినప్పుడల్లా కబుర్లు పంపుతూ

ఉందాము.''

"మీ మాటకు నేను ఎదురు చెప్పనుగానీ మీ తమ్ముడిగారి బుద్ధి ఎటువంటిదయిందో చూడండి. ఆరుమాసాలుగా ఇక్కడికొచ్చి వుంటూ ఉన్నామా? నేనేమయినానో పిల్లలేమయినారో అన్న జిజ్ఞాస అయినా వారికి లేకపోయింది. అందుకే నేనెక్కువగా విచారిస్తున్నాను. ఈ ఆరుమాసాలలోనూ ఒక్కసారైనా గుమ్మంలోకొచ్చి తొంగి చూసిన పాపాన పోలేదు. పైగా ఉత్తరం రాస్తే జవాబు రాయరు. మనస్సు ఎంత కఠినమైపోయిందో చూడండి.''

"తెలివితక్కువ అంటారా? మరేమైనా అంటారా? ఇంతవరకూ వచ్చాక మీతో చెప్పకపోవడమేం? మీరు నన్ను తోడబుట్టిన తోడుకంటే ఎక్కువ ఇదిగా చూసి కాపాడుతూ ఉన్నారు. మీ తమ్ముడిగారికిప్పటికి రెండు సంవత్సరాల నుంచీ అక్కడ ఎవరో మనిషితో సంబంధముంది. ఒకొక్కప్పుడు నాలుగైదు రోజుజులవరకూ ఆ మనిషి ఇంట్లోనే ఉండిపోయేవారు.''

"సరి ఈ పాడుబుద్ధి కూడా ఉందీ? వాడికి ఒక్క గుణం మాత్రమేలేదని సంతోషిస్తూ ఉన్నాను.''

"ఇంతవరకూ మీతో ఈ కబురు చెప్పడానికి మనస్కరించక వూరుకున్నాను. వారు వ్యవహారం ఒక రోజుకంటే ఒక రోజు చెడిపోతూ ఉన్నప్పుడు బాధ్యతగల మీతో చెప్పకుండా ఎలా ఉండను?''

"బాగానే ఉంది.''

"ఇంతకూ ఇది నా పాపము, నా పిల్లలు చేసుకున్న పాపమూను.''

"నువ్వటువంటి మాటలనకమ్మా! నా కంఠంలో ప్రాణముండగా నీకూ నీ పిల్లలకూ ఎటువంటి లోటున్నూ రానీయను. నాకు నా తమ్ముడయితే ఒకటీ, నువ్వూ నీ పిల్లలూ అయితే ఒకటిన్నీగాదు''

"మీది అటువంటి దయార్ద్ర హృదయం కాబట్టే ఇంతకాలమూ ఇక్కడ ఉండడానికి కారణమయింది. లేకపోయినట్లయితే ఒక్క నిముషం ఉండగలుగుదునా?'' అని మారయ్య భార్య బావగారితో తన భర్తను గురించి చెప్పుకోగా అతడామెకు అనేక విధాలుగా ధైర్య వచనాలు చెప్పి ఆమె యొక్క హృదయ వేదనను కొంతవరకూ చల్లార్చాడు.

★★★

రామచంద్రంగారి భార్య ఒకనాడు పిల్ల పెళ్లి సంబంధమును గురించి మాటలాడి వద్దామని తిరపయ్యగారి భార్యను కలుసుకుంది. తిరపయ్యగారి భార్య రత్నమ్మ భర్తకంటే కుచ్చితురాలు. రామచంద్రం కూతురు పెళ్లి విషయమై తగిన శ్రద్ధ తీసుకోకపోవడంవల్ల ఇక తానే ప్రయత్నం చేసి రత్నమ్మగారికి నచ్చచెప్పాలని వాళ్లింటికి బయలుదేరి వచ్చింది. లేనివాళ్లంటే ఉన్నవారికి ఉదాసీనంగా ఉండడం సహజం. రమాదేవి తమ ఇంటికి రావడమునూ చూసిన్నీ కూడా రత్నమ్మ చాలాసేపటివరకూ ఆమె రాకను గమనించనట్లుగానే నటించి ఒక గంటపోయినాక ఆమె దగ్గరకొచ్చి-

"ఏమండోయ్! ఈవేళ ఇలా బయలుదేరి వచ్చారేం? కూర్చోండి'' అని రత్నమ్మ ఇక తప్పదన్నట్లు రమాదేవిని పరామర్శించి కూర్చోబెట్టింది.


"ఏమీలేదమ్మా ఒక్కసారి మీ దర్శనం చేసుకుని వెళదామని వచ్చాను.''

"మీవారూ మావారూ కలసి అహర్నిశములు ఈ కాంగ్రెస్ గొడవల్లో తిరుగుతున్నారు.''

"మీలాంటి కలవారే ఉద్యమంలో దిగినా సాగుతుంది. ఉన్నదానినంతటినీ దేశ సేవ కిందా, ఈ కాంగ్రెస్ ఉద్యమం కిందా వెచ్చబెట్టేసుకోనివున్న మాలాంటివాళ్లం ఏం చేస్తే సాగుతుందీ?''


"కలిమిలేములు అందరకూ ఒకటే. ఈవేళ వున్నవారు రేపు లేకుండానూ పోవచ్చు. ఈనాడు లేనివారికి అదృష్టముంటే రేపు కలుగనూ వచ్చు.''

"పోనీ అలాగే అనుకుందాము. మీరు చెప్పిన దానిని మాత్రం ఎందుకు కాదనాలీ? అయితే అమ్మా! ఈమధ్య మీ భాస్కరానికి పెళ్లి ప్రయత్నం చేస్తూ ఉన్నట్లుగా వున్నారుగాదూ!''



## అప్పుడే పెళ్లా?

'నాకు అప్పుడే పెళ్లా? నథింగ్ డూయింగ్... ఇప్పట్లో పెళ్లి చేసుకునే ఉద్దేశ్యంలేదు. అయినా అప్పుడే నాకు ఏం వయసయిపోయిందని పెళ్లి చేసుకోవడానికి? ముందు నా కెరీర్‌ను జాగ్రత్తగా ప్లాన్ చేసుకుంటాను. చాలా రోజుల తరువాత 'డాన్ శీను'తో తెలుగులో హిట్ దక్కింది. ఇక రెగ్యులర్‌గా తెలుగులో నటించాలనుకుంటున్నాను' అంటోంది శ్రియ. మరోసారి బాలీవుడ్‌లో నటించే అవకాశం వస్తే శ్రియ ఇదే మాట మీద నిలబడుతుందా? అని సినీ జనాలు ప్రశ్నిస్తున్నారు.



"చెయ్యొద్దూ... వాడికీ దగ్గర దగ్గర పాతికేళ్లు వస్తున్నాయి. ఈ సంవత్సరంలో బిఏ కూడా ఆఖరయిపోతుంది. అయిదువేలిస్తామని ఒకరు, నాలుగు వేలిస్తామని ఒకరు... ఇలాగ చాలా చాలా సంబంధాలు వస్తూ ఉన్నాయి."

"ఇంకా ఏదీ నిశ్చయం చేయలేనట్లుగా ఉంది."

"లేదండి. వాళ్ల నాన్నగారికింకా ఎక్కువ ఆశ వుంది."

"ఆశకు అంతేముంది రత్నమ్మగారూ, ఏదో ఈడూజోడూ కలిసిన పిల్లలను చూసి చేయండి ఈ విషయం గురించే మీతో మాటలాడదామని వచ్చాను."

"మీద్వారా ఎవరయినా పిల్లలున్నారా ఏమిటండి?"

"మా భానుమతిని మీరింతకుముందు చూసే వున్నారు?" అని రమాదేవి చెప్పగానే రత్నమ్మ ముఖమటువయిపుకు తిప్పుకుని-

"ఇంట్లో చాలా పనులున్నాయమ్మా. చేసుకోవాలి, పోతాను" అంది.

"వెళ్లిపోతాను. నేనూ ఎక్కువసేపు కూర్చోను. కట్నాలు, కానుకలు శాశ్వతములు కావు. మేమయినా ఈ దేశసేవను గురించీ, కాంగ్రెస్ గురించీ చితికిపోయి ఉన్న సంసారులమన్న విషయం జగమందరకూ తెలిసినదే. మా పిల్లనెలాగైనా మీ కడుపులో పడేసుకున్నట్లయితే ఇక మేమేమయిపోయినా మాకు విచారంలేదు. మీరలా చేశారు అంటే భగవంతుడు మెచ్చుతాడు. ఇందులో పరమార్థముంది" అని రమాదేవి చెబుతూ ఉండగా రత్నమ్మ ఏమీ మాటలాడకుండా వూరుకుంది. అందువల్ల రమాదేవి తిరిగి చెప్పడం మొదలుపెట్టింది.

"నా పిల్లను గురించి నేను చెప్పుకోవడం మంచిదికాదు. దాని అందమును గురించి, వినయ విధేయతలను గురించి మీరెరుగురు. మీవారు కూడా ఎరుగుదురు. మీ భాస్కరము, మా భానుమతి దగ్గరగా నిలుచుంటే చిలకా గోరువంకలాగూను, చూసేవాళ్లకు ముచ్చటనూ కలిగిస్తూ ఉంటారు. మేము కూడా దానికి అయిదారువేలు కట్నమిచ్చి పెళ్లి చేయవలసిన తాహతుగల వాళ్లమే. అయితే రోజులు తారుమారు అయినాయి. ఏం చేయమూ. తరువాత మావారూ, మీవారూ చిరకాలంనుంచి కలసి సోదర భావంతో వుంటూ ఉన్నారు. ఇద్దరూ కలసి దేశానికి సేవ చేస్తున్నారు. ఒకరియందు ఒకరికి అపరిమితమయిన ఆదర వాత్సల్యాలున్నాయి."

"ఏమోనమ్మా... ఈ పెళ్లిళ్ల విషయంలో మగవాళ్లదేగానీ ఆడవాళ్ల ఇష్టమేముంది."

"అమ్మా! మీరలా అనకండి. అన్నయ్యగారికి మీరెంత చెబితే అంత. ఆ విషయం నాకు తెలుసును. ఇంటికొచ్చి పడుచునిస్తామంటూ నేనొచ్చినప్పుడు మీరు మరోమాట అనడం భావ్యం కాదు. ఒకవేళ మీరు వారికి కట్నం కానుకల విషయంలో ఆశ ఉన్నప్పటికీ మీరు మీ సాంప్రదాయమును గురించి, మీవారికి మావారికీ వున్నటువంటి స్నేహము గురించి, నచ్చచెప్పండి. చితికిపోయివున్న మాలాంటి సంసారుల నోకంటితో చూడడమే పరమార్థమని మనవి చేయండి."

"సరే... ఏదో చూదాములెండి... వెళ్లండి."

"మీరు తల్చుకున్నట్లయితే నా కోరిక తప్పక నెరవేరుతుంది. మా భాను మీ ఇంటి కోడలు అవుతుంది."

"మీకయినా తాహతుకు మించిన ప్రయత్నాలు చేయడం మంచిది కాదు. మీ తాహతుకు మీ ప్రస్తుత స్థితిగతులకు అనుకూలంగా వున్న సంబంధమునే మీరు చూసుకోవాలిగానీ తలకు మించిన కోరికలు కోరడం వల్ల ప్రయోజనమేమిటి?"

అంతవరకూ తను చెప్పినదానినంతటినీ విన్నట్లే విని రత్నమ్మ ఆ మాట అనడంతో రమాదేవికి మనస్సు చివుక్కుమనిపోయింది.

"ఛీ...పిల్లకు పెళ్లిగాకపోతేపోయె. వీళ్లింటికెందుకొచ్చి అడిగాను? ఈమె ఇంతలోనే ఎటువంటి తేలిక మాటనిందీ? అవును, ఇది నాకు తాహతుకు మించిన కోరికే. మా స్థితి చితికిపోవడంవల్లగదా ఈమె ఇటువంటి తేలిక మాట అన్నది. ఇదివరకు రోజుకయితే అయిదువేల కట్నం ఒక లెక్కా? ఇంతకూ రోజులు చెడివచ్చినప్పుడెవరిచేతనయినా మాట పడవలసి వస్తుంది" అని రమాదేవి కించపడింది. తిరిగి ఆమెతో ఇహనేమీ మాటలాడకుండా చిన్నబుచ్చుకున్న ముఖంతో అక్కడినుంచి బయలుదేరి ఇంటికొచ్చేసింది.

'అవును ఇల్లిల్లూ యాచన చేసుకుని బ్రతికే నేను నా పిల్లను చేసుకోమని రత్నమ్మగారినడగడం చాలా తప్పు' అని రమాదేవి తనలో అనేక సార్లు అనుకుని బాధపడింది.

ఆమె వెళ్లిపోయిన అనంతరం తిరపయ్య ఇంటికొచ్చాడు.

భర్తను చూడగానే రత్నమ్మ నవ్వుతూ "ఏమండోయ్! ఈవేళ మీ అబ్బాయికి గొప్ప సంబంధం వచ్చింది. మీరింటి దగ్గర లేకపోయినారుగానీ ఉన్నట్లయితే వెంటనే స్థిరపరుచుకునేవారు."

"అలాగా! ఎవరువారూ? పోనీ, నువ్వే మాటలాడకపోయినావూ? నేనుండాలా? అయితే అంత గొప్ప సంబంధమా ఏమిటి?"

"గొప్పలోనూ బహుగొప్ప సంబంధం."

"మనం కోరిన కట్నం ఈయగలరా ఏమిటి?"

"ఓ... ఒకప్పుడు వారు కూడా చాలా గొప్పవారే. అప్పుడు మనమెంత కోరితే అంతనూ ఇచ్చి ఉందురు"

"ఒకప్పుడా?"

"లేకపోతే ఇప్పుడనుకుంటున్నారా?"

"ఎప్పటి సంగతో మనకెందుకు? ప్రస్తుతం వారి స్థితిగతులెటువంటివి?"

"ఏయమ్మయినా కనికరించి తవ్వెడు బియ్యమిస్తే ఒండుకుంటారు. లేకపోతే అంతే."

"మా గొప్ప సంబంధం తీసుకొచ్చావే?"

"నేను తీసుకురాలేదు సుమండీ. వారంతటవారే వచ్చారు."

"వారెవరేమిటి? కొంపదీసి రామచంద్రంగారమ్మాయి కాదుకదా"

"సరి ఇహనేం. ఆ సంబంధం మీకూ తెలిసిందన్నమాటే"

"ఇదివరకోసారి రామచంద్రం నా దగ్గర అన్నాడు తన కూతుర్ని భాస్కరానికి చేసుకోవలసిందని."

"ఇహనేం... చేసుకోరాదూ?"

"చాలు... ఆ గోచీపాతరాయుడికి మళ్లీ అటువంటి గోచీపాతరాయుడే రావాలిగానీ చేత చిల్లిగవ్వయినా లేని ఆ రామచంద్రం మనతో తూగగలడా? ఇదివరకు అతడడిగినప్పుడు చెప్పు తీసుకుని కొట్టినట్లుగానే సమాధానం చెప్పానులే. విడిచి పెట్టలేదు."

"ఏమని చెప్పారు?"

"ఇటువంటి పెద్ద ఆలోచనలు ఆలోచించక ఏ నాలుగొందలో అయిదొందలో పుచ్చుకుని ఏ రెండో పెళ్లివాడికో మూడో పెళ్లివాడికో పిల్లనమ్ముకుంటే ప్రస్తుతం అతనికున్న చిక్కులు వదిలిపోతాయని చెప్పాను."

"మీరు నిజంగా అతనికి చాలా మంచి సలహా ఇచ్చారు."

"అటువంటి మంచి సలహాను నేనిచ్చినప్పుడు తిరిగి నీ దగ్గరకు ఏ మొహం పెట్టుకుని వచ్చారు. ఎవరొచ్చారు?"

"ఆయన భార్య రమాదేవి వచ్చి... ఓయబ్బో... ఓ పట్టానికి నన్ను విడిచిపెట్టిందా? గంటన్నరసేపు గుక్క తిప్పుకోకుండా లెక్చరిచ్చింది."

"ఏమంటుంది?"

"తన పిల్లను చేసుకుంటే ఏదో పరమార్థముంటుందిట?"

"ఈ రోజుల్లో డబ్బులేని పరమార్థం ఎవరికి కావాలి?"

"తమది చితికిపోయిన సంసారం కాబట్టి కనికరించి తన పిల్లను చేసుకోవాలిట"

"మనం చితికిపోయి ఉన్న రోజుల్లో మనలనెవరైనా కనికరించారా?"

"తరువాత తమ యావదాస్తినీ దేశసేవ కిందా, కాంగ్రెస్ కిందా ధారపోసుకున్నారుట. అందువల్ల మనం వారి పిల్లను కట్నం లేకుండా చేసుకోవాలిట."

"ఎవరు ధారపోసుకోమన్నారు? ఆశలకు లోటులేదు. అందుకు నువ్వేమన్నావు?"

"ఏమంటానో మీరూహించుకోలేరూ?"

"చెప్పు తీసి కొట్టలేకపోయినావూ"

"కొంచెం ఇంచుమించు అంత పనీ చేసానులెండి. తాహతుకు మించిన కోరికలు కోరవద్దన్నాను. ఆ మాటతో ఆమె ముఖం ముడుచుకుని చక్కాపోయింది."

"బాగా చెప్పావు."

"లేకపోతే మన ఇంటికొచ్చి మన పిల్లవాడికి తన కూతురును చేసుకోమని కోరడానికామెకెంత సిగ్గులేదో చూడండి."

"వారు దానిని విడిచిపెట్టేసి చాలా కాలమైంది. కానీ పిల్ల మాత్రం చాలా బావుంటుంది. నువ్వు చూసావో లేదో!"

"చూడకేం. అప్సరస కన్యలా వుంటుంది. దాదాపు పదిహేనేళ్లుంటాయేమో!"

"ఆ దరిద్రుల కడుపున పుట్టకపోయినట్లయితే భాను అందచందములు రాణించేవి."

"అవును మరి. దానికి మనమేం చేస్తాం? తండ్రి ఉత్త అప్రయోజకుడు. దేశంలో మంచి పేరుంది. ఏం లాభం? తనకు లేకపోతే పెళ్లాం బిడ్డలతో, అలాగే పస్తులుపడి మాడిపోతాడుగానీ అతనెవరినీ చేయి చాచి దేహీ అనడు. అతను నిజమైన దేశభక్తుడని చాలామందికి అభిమానముంది."

"అయితే ఏం లాభం? నోరు లేని మనిషికి"

"అదీ. అందువల్ల తిండికయినా లేక నానా ఇబ్బందులూ పడుతున్నాడు."

"తనకున్న సర్వస్వమునూ దేశానికి ధారపోసుకున్న చవట."

"అయితే మీరన్న కబురు నాతడు భార్యతో చెప్పి ఉండడనే, ఆమె తిరిగి నన్నగడానికి వచ్చిందా?"

"ఒకవేళ చెప్పలేదేమో! నేనలాగున అన్నప్పుడాతడు నా దగ్గరనే సిగ్గుపడిపోయినాడు. తిరిగి భార్యతో కూడా ఏమని చెప్పుకుంటాడు?"

"అవును. అంతే అయి వుంటుంది. అందువల్లనే ఆమె వచ్చింది."

"ఈ విషయం ఇకనెన్నడూ తిరిగి ఎత్తకుండా సమాధానం చెప్పావా?"

"అసలామె ఇకనెన్నడూ మన ఇంటికే రాదని నా అభిప్రాయం."

"అదే మంచి పని. అటువంటివాళ్లు తరచూ మన గుమ్మంలోకి వస్తూ వుంటే ఆ దరిద్రం మనక్కూడా పట్టుకుంటుంది."

"సరి... ఇప్పుడింతకూ భాస్కరానికి ఈ సంవత్సరం పెళ్లి చేసే ఏర్పాటు ఏదయినా ఉందా లేదా?"

"లేకపోవడమేం? తహసీల్దారుగారమ్మాయిని చేసుకోవడం మూడువంతుల ఖాయమయినట్టే"

"కట్నం ఏమయినా పెరిగిందా?"

"ఇదివరకు నాలుగువేలేనంటుండేవారు. ఇప్పుడు అయిదువేలు, ఆడబడుచులు లేరు కాబట్టి ఆ వెయ్యి రూపాయల లాంఛనాలనూ అత్తగారికే ఇచ్చేటట్లున్నా?"

"బాగానే వుంది."

"తరువాత ఉభయ ఖర్చులూ వారే భరించి అయిదురోజులూ ఘనంగా వివాహం చేయడానికి ఒప్పుకున్నారు. అబ్బాయికీ ఎనిమిది వందల రూపాయల రొక్కం, వెండి చెంబులు, పట్టు పీతాంబరాలు వగైరా లాంఛనాలు కింద ఈయడము, అబ్బాయే నచ్చినవాటిని కొనుక్కోవడమూ"

"అన్నీ బాగానే వున్నాయి. ఆ సంబంధమునే స్థిరపరచండి"

"అన్నింటికంటే ఇంకో ముఖ్యమైన షరతు ఏమిటంటే వారు కట్నం కింద, లాంఛనాల కింద ఎంత ఖర్చు పెట్టినప్పటికినీ పిల్ల వస్తువుల విషయంలో మనలనేమీ రొక్కించడానికి వల్లకాదని స్పష్టంగా చెప్పాను."

"అందుకు వారేమన్నారు?"

"ఏమన్నారు... ఒప్పుకున్నారు."


"అయితే ఆ సంబంధమును స్థిరపరచడంలో మీ ఉద్దేశ్యమేమిటి?"

"ఇంకా ప్రయత్నం చేస్తే పదివేలదాకా ముడుతుందేమోనని భ్రమ!"

"ఆశకు అంతేమిటి? పోనిస్తురూ"

"కట్నమూ, లాంఛనాలు మొదలైనవన్నీ కలుపుకుని ఇప్పుడా తాహసీల్దారుగారు సుమారు ఎనిమిదివేలదాకా ఖర్చు పెడుతున్నారా? రామచంద్రం గారు కనీసం నాలుగువేలయినా ముట్టజెప్పగలిగినట్లయితే వారి పిల్లను చేసుకొందును. ఏమీ అంటే మిగిలిన నాలుగు వేలూ ఆ పిల్ల అందం ఖరీదు చేస్తుంది. పిల్లను చూస్తే కడుపు నిండిపోయే మాట నిజం. మన అబ్బాయికి వంద, వంద యేభై సంబంధాలో వచ్చి ఉంటాయి. ఇంతమంది లోనూ భానువంటి అందమైన పిల్ల నాకెక్కడా కనిపించలేదు. అయితే ఏం లాభం? ఆమె తల్లిదండ్రులు బొత్తిగా అడుగుమాడిన వాళ్లయిపోయినారు."

"పోనిస్తూ. ఇక ఆ దరిద్రగొట్టు సంబంధం వూసెత్తకు. నాలుగువేలుగా దుకదా నాలుగు దమ్మిడీలయినా వాళ్ల దగ్గరలేవు. ఇహ వాళ్లకూ, మనకు కుదిరిందేమిటి? ఎందుకూ? రేపో మాపో ఆ తహసీల్దారుగారి సంబంధం స్థిరపరచుకొస్తాను. వాళ్ల దగ్గర మన పని మంచి బెట్టుసరిగా వుంది. వాళ్లింత కలిగినవారు కాబట్టే మనం ఎంత బెట్టుసరి చేసినా చెల్లుతుంది"



అని భర్త చెప్పినదానికంతటికీ ఆమె ఆమోదించింది.

★★★

"అయితే మారయ్యా! ప్రస్తుతం నీ పని ఎలా వుంది? బాగా కాలక్షేపం అవుతూ ఉందా? ఈమధ్య అసలు కంటికే అవుపించడం మానేశావేం?"

"ఇదిగో కాంగ్రెస్ అభ్యర్థులను చేర్పించే హడావుడిలో ఉన్నాను."

"అయితే ఓ రూపాయి డబ్బులకు లోటు లేదందూ!"

"నీ దయవల్ల లోటు లేదనే చెప్పుకోవాలి."

"రెండు మాసాలనుంచి ఈ పనిలో తిరుగుతున్నావనుకుంటాను"

"దాటింది."

"ఈమధ్య రామచంద్రంగారు నీ విషయమై అడిగారు."

"ఏమనీ?"

"మారయ్యగారెక్కడా కనిపించడంలేదు. ఎంతమంది చందాదారులను చేరిపించారో, ఎంత సొమ్ము వసూలయినదో తెలీయడంలేదన్నారు. వసూలయిన సొమ్మును కాంగ్రెసుకు జమ కట్టించవలసిందని ఆ పనిని నాకే పురమాయించాడు."

"అఘోరించలేకపోయినాడు. తాను తినలేడు, ఒకర్ని తిననీయడు"

"అతను తిననీయకపోతే మాన్తామా ఏమిటి?"

"అవునులే."

"ప్రస్తుతం నీకు ఓ మాదిరిగా పని జరుగుతూ వుంది కాబట్టి మీ కుటుంబాన్ని తీసుకు తెచ్చుకోరాదూ? ఎంత కాలమని మీ అన్నయ్యగారింటి దగ్గర విడిచి వూరుకుంటావు?"

"నేనూ ఆ విషయము గురించే ఆలోచిస్తున్నాను. కానీ ఈ రాబడితో కుటుంబ పోషణ జరుగుతుందా అని?"

"జరుపుకోవాలి. మీ అన్నయ్య అయినా సాధారణ కుటుంబీకుడుగానీ అంత వున్నవాడుకాదుకదా. నీ సంసారమునంతటినీ అతని నెత్తిమీద పెడితే ఎంతకాలమని పరిగణించగలడూ?"

"ఖాయమయిన ఉపాధి ఏదయినా దొరికుతే బావుండును. వాళ్లూ వీళ్లూ ఇచ్చే ఈ చందా డబ్బులను నమ్ముకుని కుటుంబ భారమును వహించడం చాలా కష్టం."

"అయితే కొద్దిరోజులు ఓపికపట్టు. ఈమధ్య నేను ఒక పరిశ్రమాలయాన్ని నెలకొల్పడానికి ప్రయత్నం చేస్తున్నాను. ఇప్పటికి పదివేలు చందాలు పోగుచేసాను. ఇంకో అయిదారువేలు పోగు చేసానంటే గ్రంథంలోకి దిగుతాను. అందులో నీలాంటి పనిలేని మనవాళ్లందరనూ చేర్చడమే నా ఉద్దేశ్యం"

"బాగుంది. చాలా పెద్ద ఎత్తునే వేసావు"

"లేకపోతే ఎలాగయ్యా. రామచంద్రంలాగా కూర్చుంటే ఎలాగ? మనం తినాలి, పదిమందిచేత తినిపించాలి. అదీ పురుష లక్షణం."

"మా బంధుకోటితో మీమాత్రం ప్రయోజకుడయిన మనిషి ఉండబట్టి కదా ఏదైనా అవకాశం వచ్చినప్పుడు మన శాఖవాళ్లకందరకూ ఏదైనా ఉపాధి ఏర్పడగలదు."

"కాకపోయినా ఇప్పుడేమయింది మారయ్యా! నీతో చెప్పకపోవడమేం? ఇదివరకు ఈ కాంగ్రెస్ ముసుగు వేసుకుని ఏ గ్రామమైనా సంచారం బయలుదేరి ప్లాటుఫారమెక్కి ధాటిగా నాలుగు ముక్కలు చెప్పామా అంటే ఇక చూసుకో స్త్రీలు వొంటిమీద వున్న ఆభరణాలన్నింటినీ వొలిచి కాంగ్రెస్ నిధికి ఇచ్చేసేవారు. కాసులపేర్లే కాదు, గాజుల జతలే కాదు, ఉంగరాలే కాదు, ఒకటేమిటి... తిరిగి ఇల్లు చేరుకునేటప్పటికి పది పదిహేనువేల రూపాయల మూట తయారయ్యేది."

"భేష్"

"పుచ్చుకున్నవాటికి రసీదులా వల్లకాడా? ఏ రెండువేలో మూడు వేలో కాంగ్రెస్ నిధికి జమ కట్టించడం, మిగిలినదానిని మన స్వంత ఖాతాకు జమ కట్టుకోవడమునూ. ఇప్పుడు నాకున్న యాభై అరవై వేలరూపాయల ఆస్తి ఆ రోజుల్లో సంపాదించిందేగానీ ఇప్పుడేముందీ? పావలాడబ్బు లెవ్వరైనా చందా కింద ఇచ్చారూ అంటే రసీదు కోరుతున్నారు. అలాగయినప్పటికీ అడ్డడంలేదనుకో. కానీ మునుపుటంతటి గిట్టుబాటులేదు. ఆ రోజుల్లో నేను ఈ ఉద్యమం మీద సంచారానికి వెళ్లానూ అంటే కూడా పదిమంది మన శాఖవాళ్లను వెంటబెట్టుకుని వెళ్లేవాడిని. వాళ్లమట్టుకువాళ్లు చిన్నమూ చిదరా ఏరుకునేవారు."

"అప్పుడు నేనుంటే బాగుండేది."

"అవును మరి నువ్వా రోజుల్లో అసలు కంటికి కనిపించేవాడివా? నీ షోకులేమిటో, నీ జల్సాలేమిటో అంతేగా? అన్నగారితో పేచీపడి వెయ్యి రూపాయలను నీ వాటాకింద పంచుకుని పోయావు. ఆ సొమ్ము చేతిలో ఉన్నంతసేపూ నీకు మనుషులే కనిపించేవారుకాదు."

"ఏదో కుర్రతనం?"

"పోనీ అలాగే అనుకో. ఇదిగో ఇప్పుడు స్వదేశీ పరిశ్రమశాలలను కడతానని పెద్ద పెద్ద వాళ్లనందరనూ పట్టుకుని పదివేల రూపాయల వరకూ వసూలు చేసానా? ఇంకో అయిదారువేలు పోగుచేసి పని ప్రారంభిస్తాను. అది పూర్తి అయ్యేటప్పటికి మనం కనీసం అయిదువేల రూపాయనైనా జాగ్రత్త పడకుండా వుండము."

"పడాలి"

"అంతేకాకుండా పనులు లేకుండా అఘోరిస్తున్న మనవాళ్లను పదిమందినీ అందులో చేర్చి ఉపాధి కల్పిస్తాను. ప్రాణం పోయినా మన శాఖవాడిని తప్ప మరొకడిని దరికయినా చేర్చను"

"చేర్చకూడదు."

"తరువాత ఇంకో ముఖ్యమైన విషయం నీతో చెప్పడం మరచిపోయినాను. నువ్వు భార్యాబిడ్డలు కలవాడవు. నిన్ను పాడు చెయ్యడం నాకిష్టం లేదు కాబట్టి నీకో రహస్యమును చెబుతున్నాను విను. మనకీ ఊళ్లో శుద్ధ చేదస్తం వాడొకడు బయలుదేరాడు. వాడిమూలంగా మనకు నానా కష్టాలు కలుగుతున్నాయి."

"అతను రామచంద్రమేగాదూ?"

"అవునయ్యా"

"అతనేమంటాడూ?"

"గాంధీగారు చెప్పినదానిని అక్షరాలా ఆచరణలో పెట్టాలంటాడు. ఈమధ్య ప్రారంభింపబడే సహాయ నిరాకరణోద్యమంలో కాంగ్రెస్ ప్రచారకులందరూ తీవ్రంగా ప్రచారం చేయాలనీ జైళ్లల్లోకెళ్లాలనీ అంటున్నాడు. అతనో తెలివితక్కువ దద్దమ్మ కాబట్టి అన్నింటికీ తయారవుతాడనుకో. అంతేగానీ ఎవరి భార్యాబిడ్డలను వదులుకుని ఎవరు జైల్లోకి పోతారోయ్"

"చచ్చాం... జైలే! తినడానికి కూడు లేకపోతేపోయేగానీ జైల్లోకి వెళ్లి ఎవడు కూర్చోగలడు బాబూ"

"అందుకనే నీకీ విషయం ముందుగా చెబుతున్నాను. ప్రస్తుతం నువ్వెక్కడ ఉండకుండా ఏ పల్లెటూరి ప్రాంతానికయినా పోయి అక్కడే ఈ చందాలు వసూలు చేసుకుంటూ నీ బ్రతుకును నువ్వు బ్రతుకు. రామ

చం[ద]ం నిన్ను గురించి అడిగినప్పుడు 'వాడికి వంట్లో జబ్బుగా ఉందనీ, అందువల్ల ఏ వూళ్లోనో అత్తారింటిదగ్గర మంచంమీద పడి వున్నాడు' అని చెబుతాను.''

''రక్షించావు. అలా చెప్పు బాబూ. లేకపోతే మనలాంటి వాళ్లందరూ ఆ జైళ్లల్లో బ్రతకలేము. ఓ కాఫీ ఉండదు, సిగరెట్టు ముక్క దొరకదు. తిండి సరి పడదు. మనసు పోయిందీ అంటే కొనకు ఇడ్లీ సాంబారుకు కూడా ముఖం వాచాలి.''

''అవునవును''

''నీ పుణ్యమా అని మంచి సలహా చెప్పావు. లేకపోతే ఈ రామచంద్రం గాడు నన్ను కూడా తనతో తప్పకుండా జైల్లోకి లాక్కుని పోతాడు. ఇహ చూడు మళ్లీ నువ్వు కబురంపేవరకూ ఎవరికీ తుపాకీ దెబ్బకందను''

''అలాగే చేయి. ఈ పరిశ్రామాలయము, ప్రయత్నమూ కొనసాగిన అనంతరం నీకు కబురు చేస్తాను. అప్పుడు తిరిగి వద్దువుగాని, నీ ఉనికిని మాత్రం నా ఒక్కడికీ తెలియజేస్తూ ఉండు''

''అలాగేగానీ మరి నీ సంగతేమిటి? ఆ రామచంద్రంగాడుగానీ బల వంతం చేస్తే నువ్వు కూడా వాడి వెనకాల జైల్లోకి పోయి అవస్థలు పడలేవు''

''అలా చేయడానికి నాకు మతిపోలేదు. ఆ సమయానికేదో బ్రహ్మాండ మైన ఎత్తును ఎత్తి తప్పించుకోగలనులే''

''అలాగే చేయి'' అని ఆ ఇద్దరూ మాటలాడుకొంటూ ఉండగా ఓ చిరుగు ఖద్దరు లాల్చీ, మాసిపోయిన పంచె, వెలసిపోయిన కండువా... వీటితో శుష్కించిపోయి ఉన్న రామచంద్రం అక్కడకు వచ్చి మారయ్యను చూసి

''మారయ్యా! నువ్వు, తిరపయ్య కలసి ఏదో చాలా దీర్ఘంగా ఆలోచిస్తు న్నారల్లే వుంది?''

''ఏముంది రామచంద్రగారూ! మీ అంత దేశసేవ చేయలేకపోయినా మావంతు చేయడానికి కృషి చేయాలికదా. అదే మాట్లాడుకుంటున్నాము''

''మంచిది. మనమందరం కలిసి కృషి చేస్తే తప్పకుండా మన భరతమా తకు విముక్తి కలుగుతుంది. ఈనాడు మనం అనుకుంటున్నది నిజమైన కష్టా లుకావు. ఎందరో సోదర భారతీయులు తమ సర్వస్వాన్ని ధారపోసి జైళ్లల్లో మగ్గుతున్నారు. జైళ్లల్లో తగిన వైద్యసౌకర్యం లేక చాలామంది చనిపో యారు. పోయినవారం గాంధీగారి ప్రసంగాన్ని రాజమండ్రిలో విన్నాను. మనకు త్వరలో స్వరాజ్యం తప్పకుండా వస్తుంది. మన కష్టాలన్నీ గట్టెక్కు తాయి'' అని రామచంద్రం ఉద్వేగంతో చెబుతూ వుంటే-

'ఈ జిడ్డు ఇప్పుడు వదిలేలా లేదు...మూర్ఖుడు' అనుకుని తిరపయ్య-

''చూడండి రామచంద్రంగారూ! దేశ సేవ చెయ్యవలసిందే కానీ తనకు మించిన ధర్మం ఉండదుకదా. మన పెళ్లాంబిడ్డల్ని ఉసురుపెట్టి, పుస్తు లుంచి దేశ చేయలేముకదా. మీ సంగతే ఆలోచించండి. మీ భార్యాబిడ్డలు ఎంతగా మగ్గిపోతున్నారో! ఈడొచ్చిన బంగారంలాంటి పిల్లకు సంబంధం ఖాయపరచలేకపోతున్నారు. ఒక్క అయిదువేలు ఖర్చు పెట్టాలంటే ఎట్లాగో మా ఆడవాళ్లను ఒప్పించి మీ అమ్మాయిని చేసుకునేవాళ్లంకదా!'' అని పనిలో పనిగా తిరపయ్య రామచంద్రాన్ని కించపరచి అన్నాడు.

''బాబూ తిరపయ్యా! ఒక లక్ష్యాన్ని మనం సాధించాలంటే ఎన్నో ఇబ్బందులు, కష్టాలు పడక తప్పదు. మన భరతమాతకు దాస్య విముక్తి కలిగించిన తరువాత ఈ కష్టాలన్నీ ఒక లెక్కలోనికి రావు. కష్టాలు కలకాలం కాపురముండవు. నా తల్లికి ఆ దేవుడు తగిన భర్తను చూపించకపోడు. మనం మన కోసం బతకడం కంటే అందరికోసం, సమాజం కోసం త్యాగం చేయడంలో ఎంతో ఆనందం వుంది, తృప్తి కలుగుతుంది. సంపదలు శాశ్వ తాలు కావు. కష్టాలూ శాశ్వతాలు కావు. మనం చేసిన మంచి చెడులే శాశ్వ తంగా మిగులుతాయి.''

'వీడు బాగుపడడు. మనల్ని బాగుపడనీయడు' అని తిరపయ్య తనలో తను అనుకుని-

''ఎల్లుండి గాంధీగారు బెజవాడకు వస్తారట కదా. సహాయ నిరాకరణో ద్యమం చాలా పెద్ద ఎత్తున చేస్తారటకదా. నువ్వు కూడా వెడుతున్నారా



## తమన్నా ఆనందం!

తొలి చిత్రం 'హ్యాపీడేస్'తో అందరి అభిమానాన్ని చూరగొన్న తమన్నా తెలుగులోకన్నా తమిళ్‌లో చాలా హిట్‌లను తన ఖాతాలో వేసు కుంది. తమన్నా తెలుగు భాష అంటే ఎంతో ఇష్టమని ఒక సందర్భంలో చెప్పింది. 'నిజమే! తెలుగంటే నాకెంతో ఇష్టం. మొదట్లో నాకస్సలు తెలుగు భాష అర్థమయ్యేది కాదు. తెలుగు మాట్లాడుతున్నవాళ్లవంక ఆరాధనగా చూసేదాన్ని. నేను కూడా ఎప్పటికైనా తెలుగును చక్కగా మాట్లాడాలని పంతం పట్టాను. ఇప్పుడు నా కల నెరవేరింది. తెలుగు భాషను నా మాతృ భాషలా మాట్లాడే స్థాయికి ఎదిగాను. పరిస్థితులు అనుకూలిస్తే నా పాత్రకు నేనే డబ్బింగ్ చెప్పుకుంటాను. ఆ రోజు త్వరలోనే రావాలని కోరుకుంటు న్నాను'' అంటూ ఆనందంగా చెప్పింది తమన్నా.



రామం!''

"నేనే కాదు, నాతోపాటు దాదాపు రెండువందలమందిని తీసుకువెళ్లి గాంధీగారి ఉద్యమానికి అండగా నిలుస్తాము. మేమందరమూ ఈసారి జైలుకు వెళ్లడానికి కూడా సిద్ధమే. నువ్వూ, మారయ్యా కూడా నాతో రండి''

"ఇక్కడ వెంకటాపురం అగ్రహారంలో చందాలు వసూలు చేసి ఒక వారంలో మీకు ఇస్తాము. మీరు తిరిగి వచ్చేసరికి సుమారు వెయ్యి రూపాయలు పోగుచేసి మీకిస్తాను. అందరం వెళ్లి జైల్లో కూర్చుంటే ఇక్కడి పనులెలా జరుగుతాయి. నువ్వు ఈ జిల్లా నాయకుడవు. నువ్వు తప్పనిసరిగా వెళ్లాలి. అందుచేత నువ్వు వెళ్లు''

"సరే అదీ కరక్టే... అలాగే చేయండి. నేను తిరిగి వచ్చి మిమ్మల్ని కలుస్తాను'' అని రామచంద్రం వెళ్లిన తరువాత-

"పీడా వదిలింది. అవకాశమున్నప్పుడే నాలుగురాళ్లు సంపాదించుకోవాలి. రేపట్నుంచీ చందాలకని బయలుదేరితే ఈ వారంలోగా కనీసం రెండువేలైనా వసూలవుతాయి. నువ్వు కూడా నాతోపాటు వుండు. అందులో అయిదువందలు నీకు ముట్టచెబుతా. దాంతో పది ఎకరాల మామిడితోట బేరం ఖాయమవుతుంది'' అని తిరపయ్య అనగా-

"నువ్వు ఎట్లాగైనా బ్రతకనేర్చినవాడవు. నాతో పాటు వుండి నీకండగా ఉండాలని వుంది. కానీ ఈ మధ్యన పోలీసోళ్లు కనిపించిన కాంగ్రెస్సువాళ్లనందరినీ లాఠీలతో కొట్టి జైల్లో పడేస్తున్నారు. పోయిన నెల నువ్విచ్చిన అయిదొందలూ ఉన్నాయి. ప్రస్తుతానికి మావూరెల్లి మావాళ్లని చూడాలని ఉంది. ఒక నెలరోజులుండి గొడవలవ్నీ సద్దుమణిగిన తరువాత మళ్లీ వస్తాను'' అని మారయ్య అనగా-

"అలా చేయి. ఈ రామచంద్రంగాడుగానీ జైల్లోకి వెళ్లాడూ అంటే వెంటనే నేను కాంగ్రెస్ సెక్రటరీనౌతాను. అప్పుడు మళ్లీ ఇంకో వెలుగు వెలుగుతాను.''

"సరే ఆ సమయానికి నేనూ అందుకుంటాను'' అని ఆ ఇద్దరూ తమ ముందు కార్యక్రమమును నిశ్చయం చేసుకున్నారు.

★★★

మహాత్ముడు ప్రారంభించిన సహాయ నిరాకరణోద్యమం సర్వతోముఖంగా చెలరేగింది. దేశమంతటా జాతీయ పతాకాలు, ఊరేగింపులు, జాతీయ గీతాలు, భజనలు, ఉత్సవాలు, మీటింగులు బ్రహ్మాండంగా జరుగుతున్నాయి. నూట నలభై నాలుగు దేశమంతటా స్వేచ్ఛగా విహరిస్తూ ఉంది. జైళ్లు పట్టడంలేదు. స్వచ్ఛంద దేశసేవకులెందరో లాఠీ దెబ్బలు తిని కారాగృహాలు ప్రవేశిస్తూ ఉన్నారు. స్త్రీలు, వృద్ధులు, యువకులు, వారు వీరనే తారతమ్యం లేకుండా దేశంకోసం నిజ ప్రాణాలనర్పించడానికి సంసిద్ధులై పాటు పడుతున్నారు. ఈ భయంకరాట్టహాస స్వతంత్ర పోరాటమును చూసి మారయ్య బెదిరిపోయాడు. గాంధీటోపీకి, ఖద్దరు బట్టలకు స్వస్తి చెప్పి బందరు ప్రాంతాలలో బయలుదేరి తిన్నగా కాకినాడ అన్నగారింటికి చేరుకున్నాడు. అంతవరకూ కాంగ్రెస్ ఉద్యమంలో పని చేస్తూ ఉన్నాడని, ఆ స్వతంత్ర సంగ్రామ సమయంలో అతడు కూడా జైలుప్రాప్తి అవుతాడని భయపడుతూ ఉన్న అన్నగారు భార్య అప్పటి మారయ్య వేషమును చూసి తెల్లబోయినారు.

సిల్కులాల్చీ, గ్లాస్కోపంచి, మెడలో పూల మఫ్లరు, అప్పటి అతని వేషమునుబట్టి అంతకుముందు వారు విన్నది అసత్యమేమోనని భ్రమపడ్డారు.

"ఇదేమిట్రా మారయ్యా... ఈ వాలకమంతా ఏమిటి? కాంగ్రెస్ ఉద్యమంలో దిగి దేశసేవ చేస్తున్నావని చెప్పుకున్నారే'' అని అన్నగారు ఆశ్చర్యంతో అడిగాడు.

"ఎన్ని ఉత్తరాలు రాసినా జవాబులేదు. మమ్మల్ని ఇక్కడ ఈవిధంగా పారేసి మీమానాన్ని మీరు తిరుగుతూ ఉంటే ఏమయినట్లు? దగ్గర దగ్గర సంవత్సరం అయిపోయిందిగదా. మీ అన్నగారయినా మమ్మల్ని ఎంత కాలం పోషించగలరన్న జ్ఞానమయినా ఉండనక్కరలే?'' అని భార్య తీక్షణంగా అడిగింది.

"అక్కడ నేను మాత్రం సుఖపడుతున్నానా ఏమిటి? జరుగుబాటులేని కారణంగా మిమ్మల్ని ఇక్కడ విడిచి ఏదయినా ఉపాధి దొరుకుతుందేమోనని నామానాన నేను తిరుగుతున్నాను. చెప్పుకుంటే సిగ్గుకూడానూ'' అని మారయ్య చెబుతూ ఉండగా-

"సరే దానికేంగానీ ఇంతకాలం నుంచీ నువ్వు ఎక్కడ ఉన్నట్లు? ఏం చేస్తున్నట్లు?'' అని అన్నగారు తమ్ముడ్ని అడిగాడు.

"చేయడానికేముందీ? గాంధీటోపీ, ఖద్దరు బట్టలు వేసుకుంటే ఏమయినా పని జరుగుతుందేమోనని ఆ వేషం వేసుకుని మన తిరపయ్య దగ్గరకుపోయి 'తిండిలేక చచ్చిపోతున్నాను. ఏదయినా ఉపాధి చూపవయ్యా' అని బ్రతిమిలాడగా అతడు నన్ను కాంగ్రెస్ ఉద్యమంలో చేర్పించి ఆ వూరు కాంగ్రెస్ సెక్రటరీతో నన్ను గురించి లేనిపోని గొప్పలన్నీ చెప్పి చందాలు వసూలుచేసి సభ్యులను చేర్పించే పని పురమాయించి నా ముఖాన ఇన్ని రసీదు పుస్తకాలు పారవేయించాడు.

బ్రతుకు జీవుడా అని బయలుదేరగా రోజూ నలుగురయిదుగురు చందాదారులను చేర్పిస్తే రూపాయో, రూపాయి పావలో వచ్చేది. అది నా తిండికిందా తిరగడానికిందా సరిపోయేది. దంపినమ్మకు బుక్కినదే కూలి' అన్న సామెతగా కొన్నిరోజులు గడిచాయి.

అలాగయినా దేశం మీద దండుకుని కొంతకాలం బ్రతక్కుండా ఇంతలో ఈ ఉద్యమం ఒకటి వచ్చి పడింది. ఖద్దరు బట్టలు, గాంధీ టోపీ కనిపిస్తే చాలు తన్ని జైల్లోకి తోసేస్తున్నారు. పరిస్థితులున్నీ చూస్తే నాకు చాలా భయమేసింది. 'ఎప్పటికయ్యేడి ప్రస్తుతమయ్యేది' అన్నట్లు ఈహ ప్లేటు మార్చకపోతే చచ్చిపోతానని తెలుసుకున్నాను. కడుపుకు తిండి లేకపోతే అదేపాయె. బ్రతికి ఉంటే బలుసాకయినా ఏరుకు తినవచ్చునని వెంటనే ఆ ఖద్దరు బట్టలకు, గాంధీటోపీకి ఒక నమస్కారం పెట్టి ఎలాగయితేనేమి ఇక్కడికొచ్చి పడ్డాను. ఇదీ ఇంతవరకూ జరిగిన కథ. నా అవస్థ ఏమీ తెలియక పోవడంవల్ల మీరేమో అనుకుంటారు?'' అని మారయ్య చెబుతూ ఉంటే అతని అన్నగారు, భార్య కూడా అంతకుముందుండే కోపం పోయి పొట్టలు బద్దలయ్యేటట్లు నవ్వులకు పడ్డారు.

"జరిగిందేదో జరిగిపోయింది. నువ్విలా ప్లేటు మార్చడమనేది చాలా మంచి పని. ఇకనైనా ఆ వేషాలన్నీ మానెయ్యి. ప్రస్తుతం కలెక్టరాఫీసులో ఒక అటెండర్ పని ఖాళీగా ఉంది. నెలకు పదహారు రూపాయలు జీతమిస్తారు. నేను కలెక్టర్‌గారి కాళ్లూ చేతులు పట్టుకుని ఆ పనిని వేయించగలను. ఇక నువ్వూ నౌఖరీ చేసుకుంటూ భార్యాబిడ్డలనే కనిపెట్టుకుని ఉండు. అందరూ ఆ జీతం రాళ్లతో ఇంత కలో గంజో కాచుకుని తాగి పడి వుండండి. నేను కూడా ఇక్కడనే ఉంటాను కాబట్టి అంతగా అవసరమొచ్చిందీ అంటే చూస్తూ ఊరుకోనుగదా'' అని అన్నగారు చెప్పగా-

"అలాగేనన్నయ్యా... అంతకంటే నాకు మాత్రం ఇక కావల్సింది ఏముంది? నువ్వేలా చెబితే అలా చేస్తాను'' అని మారయ్య చెప్పాడు.

"అబ్బాయిగారికి ఇప్పటికి తిక్క కుదిరింది కాబోలు'' అని భార్య

అనగా- "పొట్ట గడుపుకోవడం కోసం దేశసేవ చేయడానికి ఉపక్రమించిన వాళ్లింతకంటే ఏం చేస్తారమ్మా పిచ్చిదానా! దెబ్బకు దేవేంద్రుడే భయపడతాడన్నట్లు మనవాడు చేసినట్లే అనేకమంది చేస్తారు" అని మారయ్య అన్నగారన్నారు.

"అదిగాకపోయినా భార్యాబిడ్డలను పోషించలేక దేశానికి సేవ చేస్తారా?" అని మారయ్య భార్య అనగా-

"ఏదో అయిపోయింది. ఇక వూరుకోమ్మా" అని మారయ్య అన్నగారు మరదలును మందలించి వూరుకోబెట్టాడు.

"అయితే మన బందరు విశేషాలు ఇంకా ఏమిటండీ?" అని మారయ్య భార్య మారయ్యను అడిగింది. తన వుంపుడుగత్తె గురించి ఆమె అడుగుతూ ఉందన్న విషయమును మారయ్య గ్రహించుకున్నాడు.

"ఏమున్నాయి బందరు విశేషాలు?" అని అతడు నవ్వుతూనే సమాధానం చెప్పాడు.

"అబ్బే ఏమీలేదు. తిరపయ్య, రామచంద్రం మొదలయినవారిని గురించి అడుగుతున్నాను" అని ఆమె తన సంభాషణలోని ధ్వనిని మార్చి అడిగింది.

"తిరపయ్యకేం? అతడో పిల్ల జమిందారుఫాయీలో ఉన్నాడు. మేడలు, మిద్దెలు, భూములు, బుట్రలు ఇంటినిండా ఇంటెడు బంగారమూ, వెండిని" అని మారయ్య చెబుతూ ఉండగా భార్య అతని సంభాషణకు అడ్డువచ్చి బావగారితో-

"ఆదిలో తిరపయ్య అన్నాయనకు ఏమీలేదు సుమండీ! తిండికి కూడా కటకటలాడిపోయేవాడు. కాంగ్రెస్ ఉద్యమం వచ్చింది. అతడు కుబేరుడయిపోయాడు. అదృష్టమంటే అలా ఉండాలి బావగారూ" అంది.

"అందుకే మావాడు కూడా ఆ ఉద్యమంలో దిగుతే ఏమైనా లాభముంటుందేమోనని చూసాడు. ఆ రోజులు వేరు, ఈ రోజులు వేరు. లాభించే సూచనలేవీ కనుపించలేదు. అందుకని వెంటనే ప్లేటు ఫిరాయించాడు" అని మారయ్య అన్నగారన్నాడు.

"నాకీ ప్లేటు మార్చుమని సలహా చెప్పింది కూడా ఆ తిరపయ్యే" అని మారయ్య చెబుతుండగా-

"మరి అతని సంగతేమిటి?" అని అతడి భార్య అడిగింది.

"వ్యవహారమిలా వస్తుందని అతగాడింతకుముందే జైలు వగైరాలను తప్పించుకోవడానికి ఏదో ఎత్తును ఎత్తించుకున్నాడు. మనకు సలహా చెప్పినప్పుడతనికి తెలియదా ఏమిటి? ఈ మూమెంటు ఉధృతం తగ్గేవరకు ముసుగు పెట్టుకుని పడుకుంటాడు తీరిపోతుంది" అని మారయ్య చెబుతూ వుంటే అతని భార్య, అన్నగారు కడుపుబ్బేట్టు నవ్వడం మొదలు పెట్టారు.

"ఇహనా రామచంద్రమున్నాడు... వట్టి భ్రాష్టం. మనోవాక్కాయ కర్మలనే త్రివిధాల దేశ సేవను చేస్తానంటాడు. సుమారు లక్షరూపాయల స్థితిని దేశసేవ అని, కాంగ్రెస్ అనీ ధారపోసుకున్నాడు. నెలకు నాల్గైదు వందలు వచ్చే ప్లీడరీ వృత్తికి హస్తోదకమిచ్చాడు. అన్నమో రామచంద్రా అని భార్యాబిడ్డలు అఘోరిస్తుంటే ఇప్పటికైనా ఆ పెద్ద మనిషికి బుద్ధిరాలేదు. ఇప్పుడు తిరిగి మూడవసారి జైలుకు వెళ్లడానికి సిద్ధంగా ఉన్నాడు. ఈపాటికి వెళ్లే వుంటాడేమో కూడాను. కూతురు బంగారుబొమ్మ, పదిహేను సంవత్సరాల వయసు కలిగి రెండు సంవత్సరాలక్రితమే ఈడేరి ఉంట్లో పడి వుంది. ఆ పిల్లకు పెళ్లి చేద్దామంటే ఆ గృహస్థు చేతిలో రాగి పైసా లేకుండా ఉన్నాడు చూడండి" అని మారయ్య చెబుతూ ఉండగా-

"మరే పాపం! చాలా పెద్ద బ్రతుకు బ్రతికాడు. ఈ ఉద్యమం మూలంగా పాడయిపోయినాడు. అయితే ఇప్పుడు కాలక్షేపమెలా చేస్తున్నాడో పాపం?" అని అతని భార్య అడిగింది.

"ఏముందీ! ఇంత వచ్చినా అతనెవరినీ దేహీ అని అడగడు. తనకు లేకపోతే చిరుగులు బట్టని కప్పుకుని తిండిలేకుండా అవస్థలు పడుతూ ఉంటే ఇహ భార్య కూతురు ఆ ఇంటికీ ఈ ఇంటికీ వెడతారు. పెద్ద బ్రతుకును బ్రతికినవారనీ, రామచంద్రం సిసలైనా దేశసేవకుడనీ లేని దుస్థితిలోకొచ్చారనీ ఎవ్వరైనా కనికరించి ఏమయినా ఇస్తే కద్దు, లేకపోతే లేదు. ఈమధ్య ఇంకో భాగవతం జరిగింది. రామచంద్రంగారమ్మాయిని తిరపయ్యగారబ్బాయి భాస్కరానికి చేసుకోవలసిందిదని పిల్ల తల్లిదండ్రులిద్దరూ తిరపయ్యను, అతని భార్యను అనేక విధాలుగా ప్రాధేయపడి అడిగారు" అని అని మారయ్య చెబుతుండగా-

"అవును సుమండీ! అలా జరిగిస్తే చాలా బాగుండేది. భానుమతీ భాస్కరాలిద్దరూ భార్యాభర్తలయితే చూసినవాళ్లక్కూడా ముచ్చటగా ఉంటుంది. అందుకు తిరపయ్యగారు ఒప్పుకున్నారా?" అని అతని భార్య అడిగింది.

"సరి! నువ్వింకా రాత్రి లెక్కల్లోనే వున్నట్టున్నావు. అతడందుకు వొప్పుకోలేదు సరికదా పిల్లనిస్తానంటూ గుమ్మంలోకొచ్చిన గృహస్తును 'కూటికిలేనివాడివని, ఏ నాలుగొందలకో, అయిదువందలకో ఆ పిల్లనమ్ముకోరాదా?' అని ఇటువంటి కాని మాటలన్నీ అన్నాడు. దరిమిలాను దాదాపు ఎనిమిది వేల రూపాయల కట్నం మీదను, తహసీల్దారుగారమ్మాయిని తన కొడుక్కి చేసుకోవడానికి స్థిరపరచుకున్నాడు" అని మారయ్య అనగా-


"అయితే పాపం ఆ పిల్లకు పెళ్లి కుదరనే లేదన్నమాట" అని అతని భార్య తిరిగి అడిగింది.

"కుదరలేదు. కుదరదు. ఎలా కుదురుతుంది? డబ్బు లేకపోతే పెళ్లిళ్లు అవుతాయా? అందులోనూ చేతిలో రాగిపైసా లేకుండా ఆడపిల్లకు పెళ్లవుతుందా? పెళ్లి మాట దేవుడెరుగు? ఇప్పుడా రామచంద్ర తిరిగి జైల్లోకి పోయాడంటే ఆ తల్లీకూతుళ్ల పడే అవస్థ చూడు" అని మారయ్య మరి కొంతసేపు బందరు విశేషాలను అన్నగారికి, భార్యకు చెప్పి ముగించాడు.

***

భాను ఒళ్లు తెలియకుండా మంచంమీద పడుకుని ఉంటుంది. తండ్రి రామచంద్రం, తల్లి రమాదేవి మంచానికి చెరోవయిపునా కూర్చుని వుండి కూతురుకు ఉపచర్యలు చేస్తూ ఉంటారు.

**(ఇంకా వుంది)**






## కొవ్వలి నవలల్లో కొన్ని...

‘కొవ్వలి’ అనే పేరు తెలుగు నవలా ప్రపంచంలో ఒక తరం పాఠకులకు చాలా చిరపరిచితం. ముఖ్యంగా మధ్య తరగతి వారిలో పఠనాభిలాషను పెంచిన రచయిత శ్రీ కొవ్వలి లక్ష్మీనరసింహారావు. అరవైయ్యేళ్ళు నిండేనాటికి వెయ్యి నవలలు రాసిన ప్రతిభ ఆయనది. ఆనాటి పాఠకులనాడి తెలుసుకుని కళాత్మకంగా పాత్రల్ని మలుచుకుంటూ చమత్కారంగా కథని నడిపించేవారు. పెద్దలూ పిల్లలూ, ఆడవాళ్లూ మగవాళ్లూ విరగబడి చదివిన ఈ వెయ్యి నవలల్లో కొన్నింటిని ఆంధ్రభూమి మాస పత్రిక పాఠకులకోసం అందిస్తున్నాం. ఇది మూడవది.

## జరిగిన కథ

దేశం కోసం తన ఆస్తినంతటినీ ధారపోస్తాడు కాంగ్రెస్ సెక్రటరీ రామచంద్రం. అంతేకాదు, సాలీనా ఐదువేల రూపాయలు ఆదాయం వచ్చే భూములను, ఇల్లూ వాకిళ్లను, నెలకు ఐదువందల రూపాయలు ఆదాయమొచ్చే ప్లీడరీ వృత్తికి రాజీనామా చేసి చివరకు చేతిలో చిల్లిగవ్వ కూడా లేని దీనస్థితికి చేరుకుంటాడు. ఈడొచ్చిన కూతురుకు పెళ్లి చేయమని భార్య రమాదేవిని భర్తను కోరుతుంది. పెళ్లంటే మాటలు కాదు, అందుకు సరిపడా డబ్బు కావాలని అంటాడు రామచంద్రం. బిఎ చదువుతున్న తిరపయ్య కుమారుడు భాస్కరానికి కూతురు భానుమతితో వివాహం జరిపించమని అడగమని రమాదేవి భర్తకు సలహా ఇస్తుంది. తిరపయ్య భార్య రత్నమ్మతో పెళ్లిసంబంధం మాట్లాడిన రమాదేవిని అవమానిస్తుంది ఆవిడ. ప్రస్తుతమున్న పరిస్థితులకు అనుగుణంగా, తాహతుకు తగ్గ సంబంధం చూసుకోమని సలహా ఇస్తుంది.

"నా తల్లి వారం రోజులనుంచీ మూసిన కన్నెరుగకుండా పడి వుంటే ఏ డాక్టర్నైనా తీసుకొచ్చి ఒక్కసారి చూపించే తాహతు లేకపోయింది మనకు" అని రమాదేవి అంటూ వుంటే రామచంద్రం ఒక నిట్టూర్పును విడిచి -

"ఏం చేయను? మనం డబ్బిచ్చుకోలేమన్న విషయం అందరకు తెలిసిపోయింది. అందువల్ల ఏ డాక్టర్ పిలుస్తే పలుకడంలేదు" అన్నాడు.

"మీ కాంగ్రెస్ వాళ్లల్లోనే అనేకమంది డాక్టర్లున్నారుకదా. వాళ్లకయినా ఈ మాత్రం అభిమానం లేకపోయిందా?"

"ఉంటే ఇక లేనిదేముంది?"

"ఇప్పటికైనా మీకు ప్రాపంచిక నైజం తెలియడంలేదూ. డబ్బులేనివాడి ముఖమును కుక్కయినా చూడదు. మీరేమిటో దేశసేవ అనీ, కాంగ్రెస్ అనీ ప్రాకులాడి బ్రతుకును పాడు చేసుకున్నారు. దేశం కోసం రక్తము, మాంసము ధారపోసి వున్న లక్షరూపాయల ఆస్తిని కూడా ధారపోసుకున్న మీరంటే మీ దేశ సేవకులకెంత అభిమానం లేకపోయిందో చూడండి. ఆ తిరపయ్య మట్టుకాతడు తన కొడుక్కి మన పిల్లను చేసుకుని రక్షించవలసిందని కాళ్లావేళ్లాపడి బ్రతిమిలాడుకున్నా ససేమిరా అన్నాడు. పైగా నోటికొచ్చినట్టల్లా అని అవమానించాడు. అంతవరకూ ఎందుకు? ఇంత మహా త్యాగమును చేసి దేశం కోసం పకీరయిపోయిన మీ ఇంటికొక్క డాక్టరయినా వచ్చి మీ బిడ్డ దేహారోగ్యము చెడివుండే చూసిపోలేకపోయినాడు. ఎందుకొచ్చిన దేశము, ఎందుకొచ్చిన అభిమానము?"

"పోనిస్తు రమా! ఎవరి మంచి చెడ్డలు వారివి. నాకు కష్టకాలమొచ్చినప్పుడు వీరందరూ ఆదుకుంటారనే నేను దేశసేవ చేసానా?"

"సరే కానీయండి. భగవదనుగ్రహం ఎలా వుంటే అలా అవుతుంది. తిండి తిప్పలు లేకపోవడంవల్లను, మనసుకు స్థిమితం లేకపోవడంవల్లనూ పిల్లకీ విధంగా జబ్బు జేసిందంతేగానీ మరోటికాదు. మహారాజ భోగమును అనుభవించవలసిన నా తల్లికీనాడు కడుపు కూటికే కరువైపోయింది. ఏం చెప్పుకోను?" అని రమాదేవి గుడ్లనీరు కుక్కుతూ వుంటే రామచంద్రం చూడలేక ముఖమునటు తిప్పేసుకున్నాడు.

"వద్దు...వద్దు... మా నాన్నగారిని తీసుకుపోకండి" అని అంతవరకూ నిద్దరపోతున్న భానుమతి తృళ్లిపడి లేచి కళ్లు విప్పింది.

"ఏం తల్లీ! ఏమిటీ? నాన్నగారినెవరూ తీసుకుని పోవడంలేదు. కలవరిస్తున్నావా? కలగన్నావా?" అని అంటూ రమాదేవి భయంతో చూస్తూ వున్న కూతురును పట్టుకుంది.

"లేదు తల్లీ... నేనిక్కడనే వున్నానుగా? ఇలా చూడు" అని రామచంద్రం కూతురు ముఖమును తనవైపు త్రిప్పుకున్నాడు.

"చెడ్డ కల వచ్చిందే అమ్మా. రిజర్వు పోలీసులు, సార్జంట్లు లారీలతో మన ఇంటిమీద పడి నాన్నగారిని తీసుకుపోతున్నారుట" అని అంటూ భాను తండ్రి కంఠానికి తన చేతులను పెనవేసుకుంది.

"భయంలేదమ్మా...భయంలేదు" అని అంటూ రామచంద్రం ఆమె వీపుమీద తట్టి బుజ్జగించాడు. భాను తన చేతులను తండ్రి కంఠానికి పెనవేసుకుని ఉంచి కళ్లు మూసుకుంది.

"నిన్న మీటింగులో ఏమైనా దూకుడుగా చెప్పారా ఏమిటండీ?"

"చెప్పాను. కోట్లాదిగా ప్రజలు కడుపుమంటలతో ఉడికిపోతూ ఉంటే నాకు ఉద్రేకమొచ్చింది. చెప్పాను"

"అయితే నేడో రేపో జైలు తప్పదన్నమాట."

"తప్పించుకోవడానికి ప్రయత్నం చేయడంకంటే నీచమైన పని మరొకటిలేదు. గడిచిన పది సంవత్సరాల నుంచీ నా సర్వస్వమును దేశానికి ధారపోసి ఇప్పుడు వెనుకంజ వేస్తానా? దేశసేవలో ఈ తనువు అంతరించనయినా పోవాలి, లేదా దేశానికి ముక్తి అయినా కలగాలి... లేదూ ఈ రెంటికీ మించిన వేరుమార్గమేదీలేదు" అని భర్త ఉద్రేకంతో చెబుతూ వుంటే రమాదేవి ఒక వేడి నిట్టూర్పును విడిచి-

"అందరూ మీవంటి నిజమైన దేశసేవకులే అయితే దేశానికింతకు ముందెప్పుడో ముక్తి కలిగి ఉండేది. ఆ తిరపయ్యగారు చూడండి. జైలుకు వెళ్లవలసి వస్తుందని ఈ పరిస్థితులింకో నాలుగురోజులకు వస్తవనగానే జబ్బు జేసిందని ముసుగు బిగదన్ని పడుకుని ఇవతలకు రావడం కూడా మానేసాడు"

"రమా! ఇది ఒకరితో వంతుకాదు. ఒకరిపై పోటీకాదు. నా విద్యుక్తధర్మాన్ని నేను నెరవేరుస్తున్నాను."

"మీరు జైలు పాలవుతూ వున్నందుకే విచారించనా? పిల్లకు వంట్లో నయం లేనందుకే వగవనా? అన్నింటికంటే దుర్భరమైపోయివున్న మన దరిద్ర స్థితికే దుఃఖించనా?"

"రమా! నువ్వెందుకూ విచారించవలసిన పనిలేదు. సత్యమునే నమ్మి వుండు. భగవంతుడున్నాడు" అని అతడు క్షీణించిపోయిన కంఠంతో అంటూ ఉండగా రమాదేవి తన శుష్కించిన కళ్లతో భర్త ముఖంలోకి చూస్తూ ఉంది.

ఇంతలో ఒక లారీలో నలుగురు సార్జంట్లు, పదిమంది రిజర్వు పోలీసులు వచ్చి రామచంద్రంగారి ఇంటి దగ్గర దిగారు. లోపల వుండే రమ వారినందరనూ చూసి వేగంగా కొట్టుకునే గుండెలతో కళ్లనీళ్లు గుమ్మరిస్తూ భర్తతో ఇవతలకు వచ్చేసింది.

వెంటనే ఒక సార్జంటు వారంటు కాగితము రామచంద్రానికి చూపి "మీరు నిన్న చెప్పిన ఉపన్యాసానికి ఫలితమిది. లారీలోకి దయజేయండి"

అని ఇంగ్లీషులో రెండు ముక్కలు చెప్పాడు. రమకు ఆ భాష తెలియకపోయినప్పటికీ అంతకుముందే తనకు తెలిసివున్న పరిస్థితినిబట్టి సర్వమూ అర్థం చేసుకుంది. ఎంత ప్రయత్నం చేసినా ఆమె కనుకొలకుల్లో నీరు నిలిచింది కాదు. ఇంతలో ఇద్దరు జవానులు వచ్చి రామచంద్రానికి చెరోవయిపునా నిలుచున్నారు.

"అయ్యా! నేను సిద్ధంగానే వున్నాను. ఆలస్యంలేదు. ఒక్కసారి పిల్లను చూసి వస్తాను" అని రామచంద్రం భార్యతో లోపలకు వెళ్లాడు. అతనితో నలుగురు రిజర్వు పోలీసులు కూడా లోపలకు వెళ్లారు.

భాను కళ్లు మూసుకుని పడుకుని ఉంది. ఆమె చెదిరిన ముంగురులు ఫాలభాగం మీద పడుతూ ఉండగా రామచంద్రం తన చేతులతో వాటిని సరి చేస్తూ-

"అమ్మా! తల్లీ భానూ" అని పిలిచాడు.

ఆమె తన లోతుకు దించుకుపోయిన కళ్లను విప్పింది. ఎదురుగా వున్న తల్లిదండ్రులనూ, రిజర్వు పోలీసులను చూసి లేచి కూర్చోబోయింది. కానీ ఆమెకంతటి శక్తి లేకపోయింది. తల్లి ఆమెను పట్టుకుంది. రామచంద్రం ఏవో మాటలాడదామనుకున్నాడుగానీ అతనికి నోరు రాలేదు.

"అమ్మా! అదిగో నాన్నగారు వెళుతున్నారు" అని రమాదేవి కూతురుతో అంది.

"వెడుతున్నారా?" అని ఆమె వెంటనే కళ్లు మూయడంకంటే ఇహనేమీ చేయలేకపోయింది.

రామచంద్రం వాత్సల్యపూరితములైన తన చేతులతో ఒక్కసారి బిడ్డ శరీరమంతటినీ తడుముకున్నాడు.

"ఇంక ఆలస్యం చేయడానికి వీల్లేదు" అని ఒక రిజర్వు పోలీసు సహజమైన తన కఠోరస్వరంతో అనగా రామచంద్రం మరియొకసారి భార్య ముఖంలోకి, భాను ముఖంలోకి చూసుకుని వెంటనే పోలీసుల వెనకాల ఇవతలకు వచ్చేసాడు.

రమాదేవి కళ్లనీళ్లను గుమ్మరిస్తూ వీధిగుమ్మందాకా వచ్చింది.

"రమా! తప్పు. ఇది కంటతడి పెట్టవలసిన సమయంకాదు. నాకు భారతమాత ఆహ్వానం వచ్చింది. వెడుతున్నాను. అమ్మాయీ, నువ్వు సత్యమును నమ్మి బ్రతకండి. దానికి ఒంట్లో నింపాదిగా వుంటుంది" అని మాత్రం చెప్పి కట్టుబట్టలతో అతను పోలీసుల మధ్య లారీలోకెక్కి కూర్చున్నాడు. మరుక్షణంలో లారీ అక్కడ లేకుండా మేఘాలమీద పరుగెత్తిపోయింది. రమాదేవి బరువెక్కిన గుండెలతో హృదయం వీలిపోయేటట్లు గుడ్లనీరు గుమ్మరిస్తూ కూతురున్న గదిలోకొచ్చి ఆమెను కౌగలించుకుని విలపించడం మొదలుపెట్టింది. అంతకుముందే మూసివున్న భాను కనుకొలకుల్లోంచి కన్నీటి ధారలు చెక్కులంట కారి క్రిందకు ప్రవహించడము ఆమె చూసింది. ఆ సమయంలో తను కూడా విలపిస్తే బిడ్డ హృదయం చెదిరిపోతుందన్న ఉద్దేశ్యంతో ఆమె తన దుఃఖాన్ని తనలోనే దిగమింగి పమిట చెంగుతో నీళ్లకళ్లను తుడుచుకుని లేని ధైర్యమును తెచ్చుకుంది.

"అమ్మా! నాన్నగారు వెళ్లిపోయారా?" అని భాను కంపించే కంఠంతో అడిగింది.

"ఎక్కడకూ వెళ్లిపోలేదు తల్లీ. తిరిగి వెంటనే వస్తారుట" అని అంటూ ఆమె కూతురు కళ్లవెంట కారే వేడి నీటిధారలను తన పమిటచెంగుతో తుడిచింది. భాను ఒక నిట్టూర్పును విడిచి తిరిగి కళ్లు మూసుకుంది.

"ఏం తల్లీ! ఇప్పుడు వంట్లో ఎలా ఉంది?" అని రమాదేవి కూతురు తలను నిమురుతూ అడిగింది.

"అమ్మా! ఆకలిగా ఉందే?"

"అన్నం పెట్టమంటావా తల్లీ?"

"బియ్యమున్నాయా?" అని కూతురు అడుగుతుండే తల్లి గుండె చెరువైపోయింది.

"ఉన్నాయి తల్లీ. ఒక్క అయిదు నిముషాలు కళ్లు మూసుకుని పడుకోండివా ఈలోపుగా నేనన్నమొండి నీ మంచం దగ్గరకు తీసుకువస్తాను ఏం?"


"ఊ" అని భాను బలహీనంగా అంది.

రమాదేవి ఆమె వొంటిమీద బట్టను సరిగ్గా కప్పి వంట ఇంట్లోకి వెళ్లింది.



## నెంబర్ వన్

'సింగం' సూపర్ హిట్‌తో తమిళనాడులో అనుష్క పేరు మారుమ్రోగిపోతోంది. అదే చిత్రాన్ని 'యముడు' పేరుతో తెలుగులో డబ్ చేస్తే ఇక్కడా ఆ చిత్రం హిట్ అయింది. తెలుగులో అనుష్కకు ఎంత క్రేజ్ వుందో అంతే క్రేజ్‌ని తమిళనాడులో కూడా సంపాదించేసింది. ప్రస్తుతం 'వేదం' తమిళ రీమేక్‌లో నటిస్తున్న అనుష్క, మరో చిత్రంలో విక్రమ్ సరసన నటించేందుకు అంగీకారం తెలిపింది. తమిళనాడులో నెంబర్ వన్ పొజిషన్‌కు చేరడానికి అనుష్కకు ఎక్కువ సమయం పట్టదంటున్నారు సినీ జనాలు.



కానీ అప్పుడామెకు ఏమి చేయాలో, తానక్కడకెందుకొచ్చిందో ఏమీ తెలియలేదు. వికలమైపోయివున్న హృదయంతో ఆమె వంట ఇంటి గుమ్మంలో కూలబడి-

"అయ్యో భగవంతుడా! ఈ దీనులయెడల నీకెప్పటికీ దయ రానే రాదా? ఇన్ని ఇడుములు పెట్టే బదులు ఒకరి తరువాత మరియొకరిగా మా ముగ్గురు ప్రాణాలనూ నీ కడుపున పెట్టుకోరాదా? ఒకవైపున పిల్లకు స్వస్థత చెడిపోవడమా? మరియొకవయిపున ఇంటి యజమానికి కారాగార ప్రవేశమా? అన్నింటినీ ముంచెత్తేసిన ఈ దరిద్ర బాధ మరియొకవైపునా?"

అయ్యయ్యో... ఇన్ని కష్టాలు ఒకేసారి వచ్చినప్పుడెంతటి నిబ్బరమయిన గుండె అయినా బ్రీలిపోకుండా వుంటుందా? ఇంత వూరుంది, ఇంత మంది దేశాభిమానులున్నారు. దేశసేవకై అంతరించిపోనున్న మా కుటుంబమును చూసి ఒక్కరైనా జాలిపడరేమిటి? ఒక్కరైనా కనికరం కలగదేం? ఛీ... ఇటువంటి పాడు ప్రపంచంలోనూ, స్వార్థపరులైన ఈ ప్రజల మధ్యనూ బ్రతకడంకంటే ఈ గుక్కెడు ప్రాణాలను విడిచి తనువును చల్లార్చుకోవడం ఉత్తమం. ఆయనగారికి ఆరు సంవత్సరాలే శిక్ష విధిస్తారో, మూడుసంవత్సరాలే విధిస్తారోగదా. ఆయన తిరిగివచ్చేవరకూ నేను బ్రతుకుతానా? ఈ సుకుమారియైన బిడ్డతో ఎక్కడ కాలక్షేపం చేయను? ఏ వృత్తి వల్ల జీవయాత్ర గడుస్తుంది? నాకై నేను విచారించడంలేదు. మాకు కలిగిన దుస్థితికై నేను దుఃఖించడంలేదు. మా జీవితాలతోపాటు, నూరేళ్లు బట్టగట్టగలవలసిన ఈ కనుగాయి జీవితం కూడా దుమ్ములో కలసిపోతున్నదే అని విచారిస్తున్నారు. విచారించి చేయగలిగిందేముంది? కనికరించి ఆ తిరపయ్యగారు నా పిల్లను తన కొడుక్కి చేసుకుని కడుపులో పెట్టుకుంటాడేమోనని ఆశపడితే ఆ ఆశ నిరాశ అడిపోవడమే కాకుండా ఆయన భార్య శూలాలలాంటి మాటలతో అవమానించింది.

ఇంతకూ భగవంతుని నిర్ణయం ఎలా వుందో అలా జరుగుతుంది. కలిగిన కష్టాలకు గుండె బద్దలు చేసుకుని దుఃఖిస్తే మాత్రం ఏమి ప్రయోజనం? భాను కోసం నేను బ్రతకాలి? బిచ్చమెత్తి అయినా ఆమెను పెంచుకోవాలి. అయ్యో! ఆమెకింత అన్నం వండిపెట్టడానికని ఇక్కడకొచ్చి ఆ విషయమునే మర్చిపోయినాను. ఎంత మందమతిని? ఇంతకూ ఇంట్లో బియ్యమున్నవో లేవోగదా? అని ఆమె తనలో కొంతసేపు దుఃఖించి బియ్యంపెట్టెను చేటలో బోర్లించగా అందులోనుంచి అదృష్టవశాత్తు చారెడు గింజలు రాలినై. ఆ ఆ పూటకు వాటితో కూతురు యొక్క ఆకలి బాధ చల్లారగలదుగదా అన్న సంతోషంతో ఆ ఇల్లాలు కళ్లనీళ్లను తుడుచుకుని తనకు లభ్యమైన చారెడు నూకలను పొంగించి కూతురుకు పెట్టుకోవడానికి ఆ ప్రయత్నంలోకి దిగింది.

***

డాక్టర్ చలపతి ఖద్దరు బట్టలు వేసుకుంటూ కాంగ్రెస్ వాది అనీ, దేశసేవకుడననీ అనిపించుకుంటూ వున్నవారిలో ఒకడు. ఒక గుర్రంబండి, అట్టహాసము, ఫయిలు బాగా ఉండడంవల్ల ఒక వెలుగును వెలుగుతూ ఉన్నాడు. తిరపయ్యగారికి ఒంట్లో కొంచెం సుస్తీగా ఉందని కబురు వచ్చీ రావడంతోనే అతను చేతిలో వున్న పనిని కూడా విడిచిపెట్టేసి గుర్రంబండి మీద వారి ఇంటికి పోయినాడు. అంతకుముందు రామచంద్రంగారి కూతురుకు జబ్బుగా ఉన్నప్పుడొక్కసారయినా వాళ్ల గుమ్మంలోకి పోకుండా ఎప్పటికప్పుడే ఏదో వంక పెట్టి తప్పించుకున్న ఆ పెద్దమనిషి ఈనాడు తిరపయ్యగారికి డొక్కలో వెచ్చగా ఉందని కబురు వచ్చీరావడంతోనే గుర్రం బండిమీద పరుగెత్తాడు. ఎందుకూ?

తిరపయ్య డబ్బుగల ఆసామీ. బిల్లు ఎంతయినా ముందుగా పారేస్తాడు. అంతేకాకుండా రామచంద్రం జైల్లోకి పోగానే తిరపయ్య కాంగ్రెస్ సెక్రటరీ అయినాడు. అతనివల్ల చలపతికి ముందు ముందు చాలా ఉపకారాలు జరుగగనై ఉన్నాయి. అందువల్ల అతనిని ఆశ్రయించకపోతే ఇంకెవరిని ఆశ్రయించడం?

'డాక్టరుగారు వచ్చారూ' అనడంతోనే తిరపయ్య మంచంమీద లేచి కూర్చున్నాడు. చలపతి అతని మంచానికి దగ్గరగా ఓ కుర్చీని లాక్కుని కూర్చున్నాడు. రోగిని యధాప్రకారంగా పరీక్ష చేసాడు.

"ఏమండీ! వంట్లో ఎలా వుంది?"

"పరీక్ష చేసారుగదా...మీకేమీ తెలియడంలేదూ?"

"అజీర్ణం చిహ్నాలు తప్ప ఇకనేమీ దుర్గుణాలు కనబడడంలేదు. రెండు డోసులిస్తే సరిపోతుందిలెండి"

"అంతేనా?"

"అంతకంటే మరేమీ విశేషంలేదు."

"అసలు జరిగిన విషయం మీతో చెప్పకపోవడమేం? ఈ లాఠీచార్జీలు, జైళ్లు, హడావుడిలో వాటిని తప్పించుకోవడానికి దొంగవేషం వేసి మంచమెక్కాను"

"అలా చేసినవారు చాలామంది ఉన్నారు. మీరొక్కరేకాదు"

"ఆ...లేకపోతే పెళ్ళాం బిడ్డలను కనిపెట్టుకుని కృష్ణ రామ అంటూ కూర్చోక మనలాంటివాళ్లకి జైళ్లూ, లాఠీదెబ్బలు ఎందుకు చెప్పండి? ఏదో ఇంత కలిగినవాళ్లంగాని లేనివాళ్లంకాదుకదా?"

"అవునవును"

"వాళ్ల రామచంద్రం చూసారా? వొట్టి తెలివితక్కువవాడు. ఈ దేశసేవ పేరు చెప్పి తనకున్న సర్వస్వమును గంగపాలు చేసుకోవడమే కాకుండా పెళ్లాం బిడ్డలకు తినడానికి కూడయినా లేకుండా చేసి కూతురు ప్రాణాపాయ స్థితిలో ఉండగా జైల్లోకి పోయినాడు చూడండి.

సరే రామచంద్రం పేరే చెప్పండి. అంతటి తెలివితక్కువ మనిషి ఈ పృథ్విలో లేడు. నన్ను కూడా తనతోపాటు జైల్లోకి తీసుకుని పోదామని మహాప్రయత్నం చేసాడు. మనదగ్గర సాగుతాయా అటువంటి ఆటలు? ఇంకో వారంరోజులకే ఎటువంటి పరిస్థితులు వస్తాయని తెలుసుకుని ముసుగును బిగదన్ని మంచమెక్కాను"

"మంచి పని చేసారు"

"ఆ గొడవ తప్పించుకోవడానికి మంచమంటే ఎక్కానుగానీ ఆరోగ్యంలో వున్న మనిషికి ఆకలిదప్పులు ఏమవుతాయి? రెండుపూటలా కడుపు పట్టినంత తిని కాఫీ వగైరాలనుకూడా యధారీతిగానే కావిస్తూ ఉండేవాడిని. అయితే ప్రజలు ముఖం చూడకుండా మంచంమీద కాలు కిందకు దించకుండా ఈ పదిహేనురోజులు గడపడంవల్ల ఈ అజీర్తి రోగం పట్టుకుందనుకుంటాను."

"అంతేలెండి. అంతకంటే మరో వ్యాధి ఏదీలేదు ఇప్పుడు. కాంగ్రెసు హడావుడి అంతా తగ్గిపోయిందికాబట్టి కాస్తంత లేచి అటూ ఇటు తిరుగుతూ ఉండండి"

"నాకూ అలాగే ఉందిగానీ కాళ్లు లాగడమూ, నడుం లాగడము పట్టుకుందండీ"

"నడవడమూ, తిరగడమూ అలవాటు తప్పిపోయింది."

"ఏమయితేనేమిలెండి. నాలుగురోజులు మీ చేత్తో మందిస్తే అన్నీ తగ్గిపోతాయి. దానికేంగానీ ఈ దొంగవేషంవల్ల కారాగృహ ప్రవేశం తప్పింది గానీ లేకపోతే ఆ రామచంద్రం తనతో నన్ను కూడా లాక్కుపోయేవాడే"

"నన్నెంత బలవంతం చేసాడనుకున్నారూ! ఏదో నాలుగు డబ్బులు

సంపాదించుకుని పెళ్లాం బిడ్డలను పోషించుకునే మనకిటువంటి గొడవలెందుకు బాబూ! ఏదో కాస్త గౌరవంగా ఉండడానికి ఖద్దరు బట్టలు వేసుకున్నాం అంతేగానీ జైళ్లల్లో తిండి తిప్పలులేక అవస్థలెవరు పడగలరు?''

"అంతేనండి చలపతిరావుగారూ! అన్నింటికీ తయారయిన రామచంద్రంలాంటి వాళ్లకు చెల్లిందీ ఉద్యమం''

"మీరలా అంటారుగానీ అతని పెళ్లామూ, కూతురూ మగదీక్ష లేక ఎటువంటి చిక్కులు పడుతున్నారుకున్నారు? భార్యాబిడ్డలకంటే అతనికి దేశసేవ ముఖ్యమయిందా? ఆమధ్య కూతురుకు జబ్బు చేస్తే పది రూపాయలు ఖర్చు పెట్టి మందు ఇప్పించలేకపోయాడు. అటువంటి అనాథ బ్రతుకెందుకు చెప్పండి. నా దగ్గరకొచ్చాడు కూతురుకేదైనా మందివ్వమని. అతని దగ్గర రాగిపైసా లేదని నాకు మాత్రం తెలియదూ? బోలెడు డబ్బు పోసి చదువుకుని మందులు కొనుక్కుని దుకాణం పెట్టుకుని కూర్చున్నది వాళ్లకూ వీళ్లకూ ఉచిత వైద్యం చేయడానికా చెప్పండి? అందుకని ఆ వంకా ఈ వంకా పెట్టి ఎలాగైతేనేమి మందీయకుండా తప్పించుకున్నాను.''

"మంచి పని చేసారు. లేకపోతే తనకున్నదానినంతటినీ ఎవరు పాడు చేసుకోమన్నారు? ఇటువంటి స్థితి వస్తుందని ఈ మాత్రం తెలుసుకోనక్కర్లేదూ? మళ్లీ పెద్ద చదువుకొన్నవాడు ప్లీడరీ వృత్తిని వెలిగించినవాడూనూ''

"ఆ మధ్య ఇంకో విషయం విన్నాను. తన కూతురుకు మీ భాస్కరానికి చేసుకోవలసిందని బేరం పెట్టాడుటగాదూ? అతని తాహతెక్కడ? మీ తాహతెక్కడ?''

"అందుకనే మా ఆవిడ ఒకసారీ, నేనొకసారి చెప్పు తీసుకుని కొట్టినట్లుగా సమాధానం చెప్పాములెండి. అప్పటినుండీ ఆ విషయమును మళ్లీ తలపెట్టలేదు.

"అటువంటి సంబంధం మీకెందుకండీ? ఏ పదివేలో గుమ్మరించగల శ్రీమంతుడు రావాలిగానీ''

"కొంచెం ఇంచుమించుగా అంత కట్నానికే తహసీల్దారుగారమ్మాయిని చేసుకోవడానికి ఏర్పాటు చేసానులెండి''

"బాగుంది. అటువంటి సమానమయిన ఉజ్జీ ఉంటే గౌరవ మర్యాదలకు లోటుండదు. అన్నట్లు అడగడం మర్చిపోయాను. మీ మారయ్య ఎక్కడున్నాడు? ఈ హడావుడిలో ఏ జైల్లోకయినా దూరలేదుకదా?''

"నేనుండగా అటువంటి పనిని జరగనిస్తానా? అంతకుముందే వాడినీ వూరు నుంచి పంపేసాను''

"మంచి పని చేసారు. ఇప్పుడెక్కడ ఉంటున్నాడు?''

"కాకినాడ అన్నగారిదగ్గర చేరాడు''

"బాగుంది''

"ఆ అన్నగారే అతనికి కాకినాడ కలెక్టర్ ఆఫీసులో ఏ చిన్న నౌఖరీని కూడా చూపించాడట. దానివల్ల అతను పెళ్లాం బిడ్డలను పోషించుకుంటూ అక్కడనే పడి వున్నాడు.''

"పోనీలెండి. కొంతకాలం మిమ్మల్ని ఆశ్రయించుకుని ఉన్నందుకే రామచంద్రంలాంటి వాళ్లయినా చెప్పిన మాటలు విని జైల్లో పడ్డాడూ అంటే అతని భార్యాబిడ్డలు మీ ప్రాణానికి ఉసూరుమని ఆఘోరించి ఉందురు''

"కాదూ''

"అతన్ని మీరు చాలా అభిమానంగా చూసేవారు. మీకేమైనా బంధువు కూడానా?''

"ఆ...మా శాఖవాడు. కావలసినవాడులెండి. అంటే కాస్త దూరపు బంధుత్వం''

"అన్నట్లు మర్చిపోయాను. ఆ మధ్య స్వదేశీ పరిశ్రమాలయమును స్థాపించాలని పెద్ద హడావుడి చేసారు. ఆ ప్రయత్నం ఏమయిందండీ?''

"మనం ప్రయత్నం చేయడమూ, ఏదో అవడమూనా? పదివేలు వరకూ పోగుచేసాను. ఇంకో అయిదారువేలు సంపాదించానూ అంటే పని ప్రారంభించవచ్చు.''

"మీరు తల్చుకుంటే అదో ఘనకార్యమా ఏమిటండి''

"మీ దయవల్ల అలాగే అనుకుందాము. స్వలాభంలేని పనిని దేనినీ చేయకూడదు చూడండీ''

"అవును. దేశం ఎలా పోతే ఎవరికి కావాలి?''

"ప్రయత్నం పూర్తయ్యేటప్పటికి మనకు కనీసం అయిదారువేలయినా మిగలాలి''

"మీరే కార్యం తలపెట్టినా ఇలాగే వుంటుందని నాకు తెలుసు. లేకపోతే గొప్పలకుపోయి వృధా శ్రమ పడడం ఎందుకండీ?''

"అటువంటి వెర్రివేషాలు వేస్తే రామచంద్రంగారి సంసారం లాగునే మన సంసారాలూ వీధికెక్కవలసి వస్తుంది.''

"బాగా చెప్పారు.''


"అతను దేశంకోసం తన సర్వస్వమును ధారపోసిన మహాత్యాగి. అవును తన కుటుంబాభివృద్ధిని నాశనం చేసుకుని ఎప్పుడు పడితే అప్పుడు జైలు పాలవుతున్న మాట కూడా యదార్థమే. దానినెవరూ కాదనరు. అయితే ఏదీ? అందుకు ప్రతిఫలమేదీ? అతని భార్యాబిడ్డలీనాడు ఆకలి మంటలతో అలమటించి పోతూ ఉంటే అతను దేశసేవకుడనీ, తనకున్న దానినంతటినీ కాంగ్రెస్‌కు ధారపోసుకున్నవాడనీ ఎవ్వరైనా వారినాదరించి ఒక్క పూట పట్టెడన్నం పెట్టగలుగుతున్నారా?''

"ఆ పిచ్చి మాటలు. ఎవరు పెట్టగలరండి?''

"అవునా? అటువంటప్పుడా గృహస్థు అలా చెడిపోవడంలో అర్థమేమైనా ఉందా? ఇంట గెలిచి రచ్చ గెలవమన్నారు. తన ఆలుబిడ్డలకింత ఉపాధి కలిగించి వారి ఆకలి బాధను చల్లార్చలేని మహానుభావుడు కోట్లాదిగా ప్రజలను ఉద్ధరించడానికి బయలుదేరాడు. బాగుందాండీ?''

"బాగా సెలవిచ్చారు. ఉన్నదానినంతటినీ పాడు చేసుకోగా భార్య, కూతురు ఆ ఇద్దరికే దారి చూపలేనివాడు దేశమంతటికీ మార్గం చూపిస్తాడా? ఎందుకొచ్చిన మాటలూ? భార్యాబిడ్డలు సంతోషించనిది దేశం సంతోషిస్తే మాత్రం ఒరిగేదేమిటో? ఆలుబిడ్డల ఆకలి మంటను చల్లార్చలేని ప్రబుద్ధుడు లోకమందరూ ఆకలిబాధతో అల్లాడిపోతున్నారని తాను ప్రాకులాడడంలో అర్థం ఏముంది?''

"పోనిస్తురూ. అటువంటి వాళ్ల పేరు తలపెడితే మహాపాపం కూడానూ.



ఇప్పుడు తమకులేదని మీ ఇంటి మీద పడితే మీరు పెట్టగలరా? మా ఇంటి మీద పడితే మేము పెట్టగలమా?''

"ఆ.. ఎక్కడ పెట్టగలమండీ? ప్రపంచమంతా కాటకంతో మండిపోతూ ఉంది. సరే నాకు సెలవిప్పిస్తారా ఏమిటి? కూడా ఎవరినైనా పంపితే మందిచ్చి పంపుతాను''

"చిత్తం... మా అబ్బాయి వస్తాడండి''

"ఏ అబ్బాయి?''

"మా భాస్కరమండీ''

"ఏమిటీ మీ భాస్కరం మదరాసు నుండి వచ్చేసాడా ఏమిటండీ?''

"చదువు అయిపోయిందిగాదండీ. అందుకని వచ్చేసాడు. అప్పుడే వారంరోజులయింది.''

"బిఏ పూర్తయిందన్నమాట?''

"చిత్తం. ఇంకా ఫలితాలు తెలియాలి''

"సందేహమెందుకండీ. మీవాడు తప్పక ప్యాసవుతాడు''

"మీ దయవల్ల అలాగే జరుగుతుంది'' అని తిరపయ్య డాక్టర్‌గారితో అని "బాబూ భాస్కరం'' అని కొడుకును పిలిచాడు.

తండ్రి పిలుపు నాలకించిన భాస్కరం వెంటనే మేడ మీద నుంచి దిగి తండ్రిగారున్న గదిలోకి వచ్చి నిలుచున్నాడు.

"నాయనా! డాక్టర్‌గారితో వెళ్లి మందు తీసుకువస్తావా?'' అని అడిగాడు.

"అలాగే నాన్నగారూ'' అని భాస్కరం వినయంగా సమాధానం చెప్పి డాక్టర్‌గారి వెనకాలనే వెళ్లి గుర్రంబండిలో కూర్చున్నాడు.

భాస్కరానికిప్పుడు ఇరవై మూడో ఏడు. పచ్చగా, పొడుగ్గా బంగారు తీగలా ఉంటాడు. కళ్లజోడు, బిళ్ళగోచీతో పంచెకట్టు, ఖద్దరు లాల్చీ. అదే అతని వేషం. అతడు విద్యాధికుడైన నవనాగరికుడని అతని ముఖం చూసీ చూడడంతోనే తెలిసిపోతూ వుంటుంది.

★★★

రోజులు సరిగ్గా లేనప్పుడు పట్టుకున్న దుర్దశ పీల్చి పిప్పి చేస్తుంది. ఒక వారంరోజులకల్లా భానుమతి వ్యాధి మళ్లీ ఆమె అటూ ఇటూ తిరుగుతూంది అంటే ఇంతలో ఆమె తల్లి మంచంపట్టింది. కూతురు యొక్క మంచమునే తల్లి ఆశ్రయించాల్సివచ్చింది.

రమాదేవి కూతురుకు వ్యాధి మళ్లీ ఆమె కులాసాగా తిరుగుతూ వుందనే సంతోషించిందిగానీ తాను తిరిగి ఆమె స్థానమును ఆశ్రయించి మంచం పట్టినందుకెంతమాత్రం విచారించలేదు. కానీ తన బిడ్డ తనకై పొందే ఆరాటమును ఆమె చూడలేకుండా ఉంది.

ధర్మాసుపత్రికి వెళ్లి మందు తెచ్చి తల్లికి పోయడం, ఊళ్లో ఎవరినో ఒకరిని ఆశ్రయించి ఆ వేళకు కావాల్సిన బియ్యపు గింజలను సంపాదించడం, రోగగ్రస్థురాలైన తల్లికింత గంజి కాచిపోయడం, తానింత తాగడం, మిగతా సమయాలలో రోగి యొక్క మంచమును కనిపెట్టుకుని కూర్చుని ఆమెకు ఉపచర్యలు చేస్తూ ఉండడము.

ఈ స్థితిలో భాను శరీరము అహర్నిశములు అలసిపోతూ ఉండడం చూసి తల్లి సహించలేకపోతూ ఉంది. అయితే ఏం చేయగలదు? తమకు కలిగిన దుస్థితికి తనలో తానే కుళ్లి కుళ్లి ఏడుస్తూ ఉందా ఇల్లాలు. ఒకవైపున శరీర వ్యాధి, మరోవైపున హృదయవేదన. ఈ రెండింటి మధ్యనపడి ఆ తల్లి ప్రాణం నలిగిపోతూ ఉంది. ఒకనాడు భానుమతి తన నిత్యకృత్యములన్నింటినీ ముగించుకుని తల్లి మంచం దగ్గరకొచ్చి ఆమె ఆయాసంతో కళ్లు మూసుకుని పడుకుని ఉండడం చూసింది.

"అమ్మా! అమ్మా!'' అని భాను ఆదుర్దాగా తల్లి వొంటిమీద చేయివేసి లేపింది.కానీ రమాదేవి పలుకలేదు. దానినిబట్టి తల్లికి ఆయాసం ఎక్కువగా ఉందని భాను గ్రహించుకుని-

'ఉచితంగా ఇచ్చే ఆసుపత్రి మందులో ఏముంటుంది? పదిహేను రోజుల నుంచి మందు తెచ్చి పోస్తూవున్నా శ్రమ అంతా వృధా అయిపోయిందేగానీ ఏమీ గుణమీయలేదు' అని తనలో తను అనుకుని-

"అమ్మా! ఆయాసం ఎక్కువగా ఉందా ఏమిటే?'' అని తిరిగి కొంచెం గట్టిగా తట్టి లేపింది.

రమాదేవి కళ్లు విప్పి చూసి "ఆయాసం ఎక్కువగానే వుంది తల్లీ. ఏమవుతుందో?'' అని రమాదేవి అన్న మాటతో భానుకు హృదయం చెదిరిపోయింది.

"అయ్యో నన్ను వదిలిన రోగం నిన్ను పట్టుకుందేమో. ఈ జబ్బు నాకే ఉండిపోతే బాగుండును. నువ్వు బాధపడుతూ ఉంటే నేను చూడలేకుండా ఉన్నానే'' అని చెప్పలేని హృదయవేదనతో భాను అంటున్న మాటలను తల్లి విని 'తప్పు' అని ముక్కుమీద వేలు వేసుకుని సూచించింది. దానిని బట్టి తల్లి మాటలాడడానికికూడా అశక్తురాలుగా ఉందని భాను గ్రహించుకుని-

"అమ్మా! నీకు ఆసుపత్రి మందు పని చేయలేదు. వెళ్లి ఏ డాక్టర్‌నయినా పిలుచుకురానా?'' అని అడిగింది.

"మనవంటి దరిద్రుల ఇంటికి ఏ డాక్టర్ వస్తాడు తల్లీ!'' అని ఆమె నిస్పృహతో అంది.

"ప్రయత్నం చేసి ఎవరినయినా తీసుకువస్తాను. నీకు దాహమయితే పక్కనే పెట్టాను గ్లాసులో మంచినీళ్లు'' అని చెప్పి భాను తిరిగి తల్లి సమాధానానికి ఎదురు చూడకుండా అక్కడనుండి పరుగెత్తింది. ఆ చేరువలో ఆమె దృష్టికి డాక్టర్ చలపతిరావుగారు తప్ప ఇంకెవరూ ఆనలేదు. వెంటనే ఆమె అతని ఆఫీసువైపుకు పరుగెత్తి కొంతసేపటికి అక్కడకు చేరుకుంది..

ఆమె వెళ్లేటప్పటికి డాక్టర్ చలపతిరావుగారూ మందుకొచ్చిన భాస్కరమూ చెరో కుర్చీలోనూ కూర్చుని ఏమిటో మాటలాడుకుంటున్నారు.

"డాక్టరుగారూ...డాక్టరుగారూ'' అని గుమ్మంలో నుంచున్న భాను పిలువగానే డాక్టరుగారు, భాస్కరమూ కూడా ఉలిక్కిపడి ఆమెవైపు చూసారు.

"ఏం?'' అని చలపతిరావు ఆమెను తీక్షణంగా అడిగాడు.

"మా అమ్మకు చాలా జబ్బుగా ఉందండీ. చాలారోజులు ధర్మాసుపత్రి మందిచ్చాను. ఏమీ గుణం కనుపించలేదు. ఇప్పుడాయాసం చాలా ఎక్కువగా వుంది. మాటలాడలేకుండా ఉంది''

"ఊ...అయితే ఇప్పుడేమంటావు?''

"ఒకసారి వచ్చి చూడరూ''

"విజిటింగ్ ఫీజు అయిదు రూపాయలవుతుంది తెచ్చావా?'' అని అడగడంతోనే ఆమె ఖిన్నురాలై తలొంచుకుని నిలుచుంది.

"వెళ్లు... మేమిక్కడ నాలుగు డబ్బులు సంపాదించుకోవాలని బల్లకట్టుకుని కూర్చున్నాముగానీ ఉచితంగా నౌఖరీ చేయడానికి కూచోలేదు. మీలాంటి వాళ్లందరకూ గవర్నమెంటు హాస్పటల్సున్నాయి. అక్కడకు వెళ్లు''

"ఆ మందు ఏమీ పని చేయడంలేదండీ''

"చేయకపోతే అనుభవించు. మీ నాయన ఉన్న లక్ష రూపాయల స్థితినీ, దేశసేవ అనీ, కాంగ్రెస్ అనీ ధ్వంసం చేసుకుని వెళ్లి జైల్లో కూర్చున్నాడు. అందుకు మాకాయేమిటి ఈ శిక్ష? నేను రావడానికి వీల్లేదు. వెళ్లు''

అని తీక్షణంగా అంటూ ఉండగా ఇక చేసేదేమీలేక భాను ఒక వేడి నిట్టూర్పు విడిచి అక్కడనుంచి వెళ్లిపోయింది.

అనంతరం "ఈ అమ్మాయి ఎవరండి?" అని భాస్కరం డాక్టర్‌గారిని అడిగాడు.

"రామచంద్రంగారినెరుగరూ?'

"ఎరుగుదును. వకీలు. అతన్ని గురించి మా ఇంట్లో చెప్పుకొంటూ ఉండడం విన్నాను."

"అవును. ఆ రామచంద్రంగారి కూతురు ఈ అమ్మాయి" అని డాక్టర్ చలపతిరావు చెప్పగా భాస్కరం ఒక వేడి నిట్టూర్పు విడిచి-

"అలాగా? పాపం చాలా పెద్ద బ్రతుకు బ్రతికినవారు కదండీ?"

"పెద్ద బ్రతుకేమిటండీ? లక్ష రూపాయల సంసారి. పైగా ప్లీడరీ వృత్తి వల్ల నెలకు ఐదువందల రూపాయలను సంపాదించేవాడు."

"అవునవునట"

"అంతటి శ్రీమంతుడు, కాంగ్రెస్ అనీ దేశసేవ అనీ, దుమ్మయిపోయినాడు సుమండీ. అతను జైల్లోకివెళ్లాడు. ఇక్కడ ఈ తల్లీకూతుళ్ల అవస్థ చూడండి"

"పాపం"

"పూటకు ఠికాణాలేదు, కట్టుకోవడానికి బట్టలులేవు. ఆ పిల్ల వాలకము చూసారుగా ఎలా వుందో. ఆమె చూస్తే బంగారుబొమ్మ"

"ఏదీ... అయితే ఈ అమ్మాయికి వివాహం కాలేదా అండీ"

"సరే... అదయితే ఇహలేన్నిదేముంది? చేతిలో రాగిపైసాలేని వాడు పిల్లకు పెళ్లెలా చేయగలడు? అన్నట్లు చెప్పడం మరచిపోయినాను. ఆమధ్య రామచంద్రంగారు, భార్య ఈ పిల్లకు మీకు చేసుకోవలసిందని మీవాళ్లను బ్రతిమిలాడారు. వాళ్ల తాహతెక్కడ? మీ తాహతెక్కడ? అలా అడగడానికి వారికి సాహసం ఎక్కడ నుంచి వచ్చిందో చూడండి. మీ నాన్నగారు, మీ అమ్మగారు తగినట్లే బుద్ధిచెప్పి పంపారులెండి. అప్పుడు మీరు మదరాసులోనే వుండి వుంటారు"

ఆ గాథనంతటినీ ఆలకించిన భాస్కరం హృదయవేదనను పట్టలేకపోయినాడు. కానీ దానిని పైకి వెలువరిస్తే డాక్టర్ ఏమైనా అనుకుంటాడేమోనని లోలోపలే అణదొక్కుకుని-

"అలాగా అండీ... అయితే ఇప్పుడు పాపమీ అమ్మాయి తల్లికి చాలా జబ్బుగా ఉన్నట్టుండి"

"ఉండనీయండి. మనమేం చేయగలం? గాకపోయినా నిత్యం చచ్చేవాళ్లకోసం ఏడిచేవారెవరు చెప్పండి. ఒకసారి చూసి వచ్చినది మొదట మందీయమని పీక్కు తింటుంది. మనమిటువంటి వాళ్లకోసం ఏర్పడ్డామా చెప్పండి?" అని నిర్దయతోనూ, స్వార్థపరత్వంతోనూ డాక్టర్ అంటూన్న మాటలను భాస్కరం వినలేక పోయినాడు. వెంటనే మందుసీసాను పట్టుకుని వెళ్లిపోవడానికి లేచాడు.

"కొంపదీసి నడిచి వెళుతున్నారా ఏమిటి?" అని చలపతిరావుఆదుర్దాగా అడగ్గా-

"ఫరవాలేదులెండి. ఇక్కడేగా?" అన్నాడు భాస్కరం.


"ఎందుకు సార్. మా గుర్రబండిమీదనే వెళ్లండి. దాని పని నాకిప్పుడేమీ లేదు కూడాను" అని బలవంతం చేసి డాక్టర్‌గారు భాస్కరాన్ని తమ బండిమీదనే సాగనంపాడు. బండిలో భాస్కరం-

'నిజంగా ఆమె ఒక ఏంజిల్ (దేవకన్య). అంతకుముందెంత గొప్ప శ్రీమంతుడైనా చితికిపోయిన సంసారియొక్క స్థితి ఇలాగే ఉంటుంది. ఈ డాక్టరు కాంగ్రెస్‌వాలానని చెప్పుకుంటాడు. దేశసేవ చేస్తానంటాడు. ఖద్దరు బట్టలు ధరిస్తున్నాడు. సాటి దేశీయ నాయకుడు మాతృసేవా దురంధరుడై కారాగార వాసంచేస్తూ వుంటే రోగగ్రస్తురాలైన అతని ఇల్లాలు విజిటింగ్ ఫీజు ఈయలేకపోయిందని, ఈ డాక్టరుగారు నిరాకరించారు. గుండెలు బ్రద్దలైపోయే సంఘటన. రామచంద్రంగారంటే సామాన్యమైన సంసారా? అతడు దేశంకోసం అర్థమునుగోల్పోయి ప్రాణాన్ని కూడా కోల్పోవడానికి సిద్ధంగా ఉండి కారాగారవాసం చేస్తూ ఉంటే ఇక్కడ ఆకలిమంటలతో అల్లాడిపోతూ ఉన్న అతని సంసారం వైపు చూసి ఒక్కరూ కనికరించలేకుండా



## 'నమ్మకం లేదు'

'నేనెప్పుడూ ఏ విషయమైనా పాజిటివ్‌గానే ఆలోచిస్తాను. అలాగే నేను నటించిన చిత్రం ఫ్లాఫ్ అయితే నిరాశతో కృంగిపోను. అది నా తత్వం కూడా కాదు. నెగటివ్‌గా ఆలోచిస్తే మనం ఎప్పుడూ ముందడుగు వేయలేం కూడా. నా కెరీర్‌లో బిగ్గెస్ట్ హిట్ అయిన 'మగధీర' తరహాలో నా చిత్రాలన్నీ విజయవంతం కావాలని కోరుకుంటాను. అందరూ అంటుంటారు నెంబర్ల మీద నమ్మకం వుందా అని. నాకైతే ఈ నెంబర్లమీద నమ్మకం లేదు' అని నిర్మొహమాటంగా తన అభిప్రాయం వ్యక్తం చేస్తోంది కాజల్.



ఉన్నారు. వారి యెడల ఒక్కరూ సానుభూతిని చూపలేకుండా ఉన్నారు. ఛీ...పాడు ప్రపంచం!

దేశసేవ అనీ, ప్రజాసేవకులమనీ వేదికలెక్కి ఉపన్యాసాలిచ్చే వారొక్కరి కంటే ఈ కుటుంబం యొక్క దీనదశ కనబడడంలేదు కాబోలు. అంత స్వార్థ పరత్వము, మోసము తప్ప ఇంకేమీలేదు' అని అతడు తనలో తాను రామ చంద్రంగారి కుమార్తెను చూసి ఆమెయొక్క విషాదగాథను ఆలకించినప్ప టినుంచీ భరించలేని హృదయతాపమును పొందుతూ ఇల్లు చేరుకు న్నాడు.

***

భాస్కరం తండ్రికి మందును పట్టుకొచ్చి ఇల్లు చేరుకునేటప్పటికాతని కళ్లబడిన దృశ్యమిది.

తండ్రి తిరపయ్య వీధి సావిట్లో కుర్చీని వాల్చుకుని కూర్చుని ఉన్నాడు. భాను గుడ్లనీరు గ్రక్కుతూ వాళ్ల గుమ్మంలో నిలుచుని ఉంది. ఆమె యొక్క దీనస్థితిని చూడగానే భాస్కరానికి గుండె చెరువయిపోయింది.

డాక్టర్‌గారి ఆఫీసు దగ్గర అంతకుముందు కనిపించినప్పటికంటే అప్పటి ఆమెయొక్క స్థితి మరింత జాలిని కలిగిస్తూ ఉంది.

ఎండలో తిరిగి తిరిగి వుందేమో చంద్రబింబంలాంటి ఆమె సుకుమార వదనం తోటకూర కాడవలె వాడిపోయి ఉంది. చెదిరిపోయిన ముంగు రులు, నీటి దైన్యత నిండిన కళ్లు, ప్రపంచంలో వుంటే దుఃఖం, నిస్పృహ ఆమె ముఖమునే ఆశ్రయించి ఉన్నాయని భాస్కరం గ్రహించుకున్నాడు. అప్పుడామె తిరపయ్యతో ఏమేమో జాలి కలిగించేటట్లు చెప్పుకుంటూ మధ్యమధ్య తన చిరుగుల పమిటతో కొత్తగా పొంగుతూ వున్న యవ్వన సౌందర్యాన్ని మరుగువరచుకోలేక సిగ్గుపడుతూ ఉంది.

భాస్కరం ఆమె స్థితినంతటినీ అంతకుముందే తెలుసుకుని ఉన్నప్పటికీ తనకేమీ తెలియనట్లుగానే తెచ్చిన మందుసీసాను బల్లమీద వుంచి తాను కూడా ఒక కుర్చీలో కూర్చుని ఆ సంభాషణను తాను విననట్లుగానే పేపరు చూస్తున్నాడు. కానీ తిరపయ్య, భానుల సంభాషణ అతడు పేపరును ముఖానికి అడ్డం పెట్టుకుని వింటూనే వున్నాడు.

"అవును మరి డబ్బీయకపోతే మన ఇంటికి ఏ డాక్టరొస్తాడు?"

"అందువల్ల ఈ సందర్భంలో తామేదయినా సాయంచేసి మా అమ్మ ప్రాణాలను కాపాడతారని ఆశిస్తున్నాను."

"కుర్రపిల్లవు. నీకేమీ తెలియదు. అందరూ మామూలు సంసారులే. అందులోనూ ఒకరికొకరు సాయం జేసే రోజులా ఇవి?"

"అయ్యా! నాకెంతో అధైర్యం కలుగుతేగానీ మీ ఇంటికొచ్చి మీ సాయ మును ఆపేక్షించను. మా అమ్మ చావు బ్రతుకుల్లో ఉంది. డబ్బు లేకపోతే డాక్టర్‌గారు రానంటున్నారు. మీకు తోచిన సాయమునేదైనా చేయించండి. మా అమ్మ బ్రతికి ఇవతలపడితే మేమిద్దరమూ మా నాయనగారు జైలు నుంచి వచ్చేవరకూ ఏ రెక్కల కష్టమునైనా చేసుకుని ఎక్కడైనా బ్రతుకు తాము"

"ఏమీ లాభంలేదమ్మాయి. వెళ్లిపో. ఈ ఉపన్యాసమును మరోచోట ఇచ్చినట్లయితే ఏమైనా ప్రయోజనముంటుంది"

తండ్రి నిర్దయతో చెబుతూవున్న సమాధానమును భాస్కరం వినలేక పోయినాడు. భాను గుడ్లనీరు గ్రక్కుతూ తిరిగి ఇలా చెప్పింది.

"నాయనా, మీరూన్నూ కాంగ్రెస్‌వాదులు, తోటి దేశభక్తుడు భారత మాత ఆహ్వానము అంగీకరించి కారాగారశిక్షను అనుభవించడానికి పోయి నాడు. అతని కుటుంబమిటువంటి దీనదశలో వుంటే తమరు గోరింతయినా కనికరము చూపరా? అయ్యో ఈ సమయంలో మాకు దిక్కెవరు? మా అమ్మను బ్రతికించే పుణ్యాత్ములెవరు?"

"ఎవర్నడుగుతావు? ఈ వూళ్లో నేనుతప్ప నీకింకెవరూ కనిపించలేదా? వెళ్లు వెళ్లు"

"తండ్రీ! మిమ్మల్ని అర్థించినట్లే ఇంతకుముందు అనేకమందిని యాచించాను. అందరూ మీరు చెప్పినట్లుగానే చెబుతున్నారు. ఏం చేయను? ఎవరితో చెప్పుకోను?"

"ఇదిగో నాకూ వంట్లో సుస్తీగా వుంది. నీతో వాదించడానికి నాకు వోపి కలేదు. త్వరగా పో. ఏం? మీ బాబు వెచ్చబెట్టుకున్న లక్ష రూపాయల స్థితి లోనూ నేనేమయినా ఒక రాగిపైసా ఎరుగుదునా?"

"అయ్యో...తండ్రీ! నేనలా అన్నానా?"

"ఏమోలే... బాకీ వున్నట్లుగా రొక్కించి అడుగుతున్నావు"

"నా దీనదశను తమతో మనవి చేసుకుంటున్నానంతేగానీ రొక్కించి అగడంలేదు తండ్రీ! మా నాయన ఉన్న యావదాస్తినీ వెచ్చబెట్టుకోవడంవ ల్లనే నేనిప్పుడు మీలాంటివారిని ఆశ్రయించాల్సి వచ్చింది."

"ఎవరు వెచ్చబెట్టుకోమన్నారని? తెలివితక్కువగా ప్రవర్తించినందుకు అనుభవించవలసిందే"

"మా నాయన తాగుడు కింద తన సర్వస్వమును గోలుపోలేదు. వ్యభి చారవృత్తి కింద పాడు చేయలేదు. దేశం కోసం, కాంగ్రెస్‌కోసం, ప్రజా సంస్థ లకోసం, తన సర్వస్వమును కోల్పోయి బికారి అయిపోయినాడు. అప్పుడా తడు మహాకార్యము నాచరించిన త్యాగి అని, స్తుతి వాక్యాలు పలికినవారు మీరు కారా? అతనినా కార్యానికి ప్రోత్సహించి కాంగ్రెస్ నిధులకనీ, మీటిం గులకనీ యాంచించినది మీబోటి పెద్దలుకాదా?"

"ఓహో పిట్టకొద్ది, కూత ఘనము అన్నట్లు అట్టే గడుసు కబుర్లు చెప్పక అవతలకు నడు. పళ్లు రాలగలవు" అని తిరపయ్య కూర్చున్న చోటు నుంచి లేవగా అతడు నిజంగానే కొడతాడని భయపడి భాను ఇక అక్కడ నిలుచోకుండా కళ్లంత ధారాపాతంగా ప్రవహిస్తున్న కన్నీటిధారలను తుడు చుకుంటూ అక్కడినుండి వెళ్లిపోయింది. అనంతరం-

"పాపం! ఆ అమ్మాయి ఎవరు నాన్నగారూ?" అని భాస్కరం తండ్రిని అడగ్గా-

"ఎవరని చెప్పను? ఇటువంటి యాచకులు దేశం మీద లక్షోపలక్షలు న్నారు. మనమందరకూ సాయం చేయగలమా? సరే ఆ గొడవకేమిలే మందు తెచ్చావా?" అని తిరపయ్య కొడుకును ఆ సంభాషణ నుంచి మర పించే ఉద్దేశ్యంతో అడిగాడు.

"తెచ్చాను. ఇదిగో నాలుగు మోతాదులుట" అని చెప్పి భాస్కరం బల్ల మీదునున్న మందు సీసాను తండ్రికి అందివ్వగా దానిని పట్టుకుని దగ్గు కుంటూ మేడమీదకి వెళ్లిపోయినాడు.

జరిగిన సంఘటనను కళ్లారా చూసిన భాస్కరానికి హృదయముండబ ట్టలేదు. వెంటనే లోపలకు వెళ్లి తన మనీపర్సు జేబులో వేసుకుని తిరిగి ఇవ తలకువచ్చి చూసేటప్పటికి మలమల మాడే ఎండలో వయిన నెత్తీ, కింద కాళ్లూ కాలుతూ ఉండగా రోడ్డుమీద వడివడిగా నడిచిపోతున్న భాను దూరాన అతనికి కనిపించింది.

అతడిక ఆలస్యం చేయకుండా ఆమెను వెంబడించి వడివడిగా నడిచి పోవడం మొదలుపెట్టాడు. కొంతసేపటికి అతడామెను కలుసుకుని ఆగమ న్నాడు. భాను మొదట తెల్లబోయింది. తానంతముందు డాక్టర్‌గారీ ఆఫీసు దగ్గర ఒకసారీ, తిరపయ్యగారింటిదగ్గర ఒకసారీ అతనిని చూడడంవలన ఒకవేళ ఆ ఇద్దరిలోనూ ఎవరైనా కనికరించి తనకు సాయం చేయడానికి కబురు వంపారేమో అనుకుంది.

"మీరెవరు?"

"తిరపయ్యగారి అబ్బాయినిలే"

'చిత్తం... నన్ను పిలిచిన పని?"

"మీ ఇల్లెక్కడ?"

"నాలుగు వీధులు దాటాలి"

"పద. మీ ఇంటికే వస్తున్నాను"

"మా ఇంటికా?"

"అవును"

"ఎందుకూ?"

"మీ అమ్మకు జబ్బుగా ఉందన్నావుగాదూ?"

"తమరంత దయామయులా?"

"సరే...త్వరగా నడు"

ఇద్దరూ వడివడిగా నడుస్తున్నారు.

"నీ పేరమ్మా?"

"భాను"

"నువ్వు రామచంద్రంగారమ్మాయివా?"

"అవునండి. మా దుస్థితి ఇలా వచ్చింది."

"ఫర్వాలేదులే. రోజులెప్పటికీ ఒకేలాగున వుండవు"

"మీ పేరండీ?"

"భాస్కరం."

"మీరు మా నాన్నగారిని ఎరుగుదురా?"

"చెప్పుకోవడం."

"చూసారా... మీ నాన్నగారికి మామీద ఎంత దయ లేకపోయిందో?"

"వారెప్పుడూ అదే మాదిరిలే" అని ఇద్దరూ మాట్లాడుకుంటూ గమ్యస్థానం చేరుకున్నారు. భానుమతి భాస్కరాన్ని లోపలకు తీసుకువెళ్లి ఒళ్లు తెలియకుండా మంచంమీద పడివున్న తల్లిని చూసింది. రమాదేవి ఎగశ్వాస, దిగశ్వాసలతో బాధపడుతూ ఉంది.

"అమ్మా..అమ్మా. నిన్ను చూడడానికి తిరపయ్యగారబ్బాయి వచ్చారు చూడు"

కానీ తల్లి మారుపలకకపోవడంవల్ల భాను గుడ్లనీరు గుమ్మరిస్తూ తల్లి మీద పడి విలపించడం మొదలుపెట్టింది. భాస్కరమామెను ఇవతలకు తీసుకువచ్చి-

"అమ్మాయీ! మీ అమ్మకేమీ భయంలేదు. ఇదిగో ఈ మనీపర్సును నీ దగ్గర ఉంచుకో. ఇందులో నూట పాతిక రూపాయలున్నాయి. నేనిచ్చినట్లు కాకుండా డాక్టర్ చలపతిరావుగారింటికి వెళ్లి ఆయన అడిగినదానినిచ్చి తీసుకురా. జట్కా బండిమీద వెళ్లు. నేనిక్కడ ఉన్నట్లుగా కూడా ఆయనకు చెప్పొద్దు. మీరు వచ్చేటప్పటికి నేను ఈ ప్రక్క గదిలో వుంటాను. నేను నీకీ విధంగా సాయం చేస్తూ ఉన్నట్లెవరికీ తెలియకూడదు.త్వరగా వెళ్లు. నువ్వు తిరిగి వచ్చేవరకు నేను మీ అమ్మను కనిపెట్టుకుని ఉంటాను" అని అతడామె చేతికి తన మనీపర్సును అందించాడు. భాను కృతజ్ఞతతో ఒకసారి మనీపర్సు వయిపుకూ, మరోసారి భాస్కరం ముఖంలోకి చూసి-

"ఈ బీదపక్షుల యెడల ఎవరికీ లేని దయ మీకెందుకొచ్చింది?" అని అడగ్గా-

"ఆ విషయాలన్నీ తరువాత చెప్పుకుందాంలేగానీ ముందుగా వెళ్లి డాక్టర్‌గారిని తీసుకురా" అని అతడు చెబుతూ ఉండగా ఆ వీధివెంట ఒక జట్కా బండి వెడుతూ ఉంది. భాస్కరం ఆ బండిని మాటలాడి భానును దానిమీద డాక్టర్‌గారింటికి పంపి తాను రమాదేవికి ఉపచారాలు చేస్తూ ఆమె మంచం దగ్గర ఉన్నాడు.

డబ్బుంటే కొండమీద కోతి దిగి వస్తుంది అని వూరికే అన్నారా? ఆమె వెళ్లి అయిదు నిముషాలు అయిందోలేదో అప్పుడే డాక్టర్ చలపతిరావు గుర్రబండిలో భానును ఎక్కించుకుని వచ్చాడు. అతని రాకను లోపల నుంచే గమనించిన భాస్కరం ఆ ప్రక్కగదిలోకి తప్పుకున్నాడు.

భాను డాక్టర్‌గారితో లోపల ప్రవేశించింది. డాక్టర్ ముందా రోగిని పరీక్ష చేసాడు. ఆమె చేతిలోవున్న పర్సును చూడగానే అతనికి దయ కలిగింది కాబోలు.

"అమ్మాయీ! మీ అమ్మకొచ్చిన ఉపద్రవమేదీలేదు. అంతకుముందీమె ఏ మనోవ్యాధివల్లనో తీసుకుంటూ ఉన్నట్లుంది. ప్రస్తుతం శ్లేష్మాధిక్యతవల్ల ఊపిరాకుండా ఉంది. రెండు ఇంజెక్షన్లు ఇస్తే తగ్గిపోతుంది. అందుకు పది రూపాయలవుతాయి" అన్నాడు.

"చిత్తం. మీ మాటకడ్డుచెప్పను" అని ఆమె పర్సులోంచి ఒక పదిరూపాయల కాగితము తీసి అతని చేతిలో పెట్టింది. డాక్టర్ దానిని అందుకుని జేబులో పెట్టుకున్న అనంతరం తన సంచీలోనుంచి ఇంజెక్షన్ సామానులు తీసి రమాదేవి చేతిమీద ఒక ఇంజెక్షన్ ఇచ్చాడు.

"తిరిగి సాయంకాలం వచ్చి మరో ఇంజెక్షన్ ఇస్తాను" అని చెప్పి వెళ్లిపోయినాడు. అతను వెళ్లిపోయిన అనంతరం ప్రక్క గదిలోంచి భాస్కరం ఇవతలకు వచ్చాడు.

"డాక్టర్‌గారు మీ అమ్మగారికేమీ భయంలేదని చెప్పారు విన్నావా?" అని అడిగారు.

"ఈ దినం ఇలా గడుస్తుందని నేననుకోలేదు. మీ దయవల్ల గండం గడిచింది. మీ ఋణమును నేనెలా తీర్చుకోగలనో తెలియకుండా ఉంది" అని భాను కృతజ్ఞతతో అంటూ ఉండగా-


"ఆ...దానికేమిలే... ఆపన్నులకు సాయం చేయడం ప్రతి మానవునికీ కర్తవ్యం" అని భాస్కరం ఆమెకు సమాధానం చెబుతూ ఉండగా-

"తల్లీ భానూ! దాహం" అని మంచం మీద పడివున్న రమాదేవి కళ్లు విప్పింది.

"ఇంజెక్షన్ ఎంత త్వరగా పని చేసింది?" అని అంటూ భాను వెంటనే తల్లికి దాహమిచ్చింది. మంచినీళ్లు తాగిన వెంటనే రమాదేవికి నూతన జవం కలిగినట్లయింది.

"తల్లీ! నీతో మాటలాడుతున్నవారెవరు?" అని ఆమె కళ్లు విప్పి చూస్తూ అడిగింది.

"అమ్మా! తిరపయ్యగారబ్బాయే! భాస్కరంగారు. డాక్టర్‌ను తీసుకువచ్చి నీకు ఇంజెక్షన్ ఇప్పించడమే కాకుండా మనకీ ఆపద సమయంలో



విశేష ధన సహాయం కూడా చేసారు'' అని కూతురు చెబుతూ ఉంటే తల్లి ఆ విషయమును వెంటనే నమ్మలేకపోయింది. భాస్కరం ఆమె మంచం దగ్గరకు వెళ్లాడు. రమాదేవి అతడిని చూసి కృతజ్ఞతతో మెరిసే కళ్లతో ముఖం లోకి చూసి-

"నాయనా! తిరపయ్యగారికి మీవంటి ఉత్తముడు జన్మించడంవల్ల ఆయన జన్మ తరించింది. మీ ఋణమును మేమెలా తీర్చుకోగలము? చూడ చుట్టము, మొక్క దైవమూ లేని ఈ ఆపద సమయంలో నువ్వే మా పాలిట భగవంతుడివై అవతరించి రక్షించావు. మదరాసు నుంచి ఎప్పుడొచ్చావు నాయనా?'' అని అడిగింది.

"నేనొచ్చి అంతా వారం రోజులయిందిలెండి. రామచంద్రంగారు జైలులోకి వెళ్లడము, ఇక్కడ మీ పరిస్థితులు మొదలైన సంగతులన్నీ తెలుసుకున్నానులెండి. మీకొచ్చిన భయమేమీలేదు. డాక్టర్‌గారు మీ వంట్లో ఉద్రుత వ్యాధి ఏమీలేదని చెప్పారు. కొంచెం విశ్రాంతిగా మాత్రం ఉండండి. నేను తిరిగి సాయంకాలం వస్తాను. నా చదువూ అయిపోయిందిగాబట్టి ఇక నేనిక్కడనే వుంటాను. రామచంద్రంగారు తిరిగి వచ్చేవరకూ నేను మిమ్మల్ని నిత్యము వచ్చిపోతూ చేతనైన సాయమును చేస్తూ ఉంటానులెండి. ధైర్యంగా ఉండండి. వెళ్లి వస్తాను'' అని చెప్పి అతడివతలకు వచ్చేస్తూ ఉంటే భాను కూడా అతని వెనకాలనే గుమ్మందాకా వచ్చింది. వీధి గుమ్మానికి అవతల అతను, ఇవతల ఆమె.

"మళ్లీ సాయంకాం వస్తారా?''

"తప్పక వస్తాను''

"మీ విశాల హృదయాన్ని ఏమని కొనియాడాలో నాకు తెలియడం లేదు''

"తెలుస్తుందిలే''

"ఇంత డబ్బు నా దగ్గర ఎందుకూ? తీసుకువెళ్లండి''

"అక్కర్లేదు. నీ దగ్గరే వుంచుకో. నేనిలా వచ్చి మీకిటువంటి సాయమును చేసినట్లుగా ఎవరికీ తెలియనీయకు భానూ'' అని అంటూ అతడామె మీగడ తరగలవంటి నునుచెక్కులను తన చేతులతో నిమురుతూ అన్నాడు.

భాను అతని స్పర్శలో స్వర్గీయానందము అనుభవించి అతను చెప్పిన దానికి మౌనముతో తన అంగీకారమును సూచించింది.

అతడు గుమ్మం దిగి వెళ్లిపోయినాడు. భాను అతను కనుపించేవరకూ చూసి తరువాత లోపలకు వెళ్లిపోయింది.

***

అనంతరం ఒక నెల గడిచేటప్పటికల్లా రమాదేవి పూర్తి ఆరోగ్యంలోకొచ్చింది. వారి కష్టాలు కూడా చాలావరకు గట్టెక్కినా వారి కుటుంబ పోషణకు అవసరమైన ధన సహాయమును చేయడమే కాకుండా భాస్కరం నిత్యం ఏదో ఒక సమయంలో వారింటికొచ్చి చూసిపోతున్నాడు. అతనియొక్క అపారమైన దయతో ఆ తల్లీకూతుళ్లు ఇద్దరూ పూర్తి స్వస్థతను పొందుతూ ఉన్నారు. ఆనాడు కనుచీకటి పడుతూ ఉండగా భాస్కరమొచ్చాడు. అతడు వచ్చేటప్పటికి భాను సందెగుమ్మాలు తుడుచుకుంటూ వుంది. తల్లి దొడ్లో దీపాల పని చూస్తూ వుంది.

భాస్కరంయొక్క రాకను గమనించిన భాను వెంటనే చేతిలోని పనిని ముగించుకుని అతను కూర్చోవడానికి చాపవేసింది. అతను దానిమీద కూర్చుని-

"ఏమిటి సంగతులు?'' అని అడిగాడు.

"ప్రొద్దుటినుంచీ మీ దర్శనం కాలేదు. అదే పెద్ద విశేషం. మీరు రాలేదని మా అమ్మా నేనూ ఇంతవరకూ ఏ వందసార్లయినా అనుకుని ఉంటాము''

"నేనా విషయమును ఎరుగుదును. అయితే నా నాన్నగారికి చాలా జబ్బు ఎక్కువగా ఉంది. అందువల్ల తీరికలేక రాలేకపోయాను.''

"అయ్యో పాపం... ఇంకా తగ్గలేదూ?'' అని భాను అంటూ ఉండగా వెలిగించిన దీపమును పట్టుకుని రమాదేవి అక్కడికొచ్చి-

"వచ్చావా నాయనా! ఈవేళ నువ్వు కనిపించలేదని అనుకుంటున్నాము. భాను ఇంతవరకూ కళ్లల్లోని నెత్తురు కిందకి దిగేటట్లు వీధిగుమ్మంలో నిలుచుని నీకోసం ఎదురుతెన్నులు చూస్తూనే వుంది''

"అవునా భానూ! అతని అతడు భాను బుగ్గలమీద మృదువుగా కొడుతూ అన్నాడు.

"మీ చేతులెప్పుడూ నా బుగ్గలమీదే ఉంటాయేం?'' అని భాను నవ్వుతూ అంది.

"నీ బుగ్గలు చూస్తే నాకు చాలా సరదా భానూ''

"అన్నీ దొంగ మాటలు''

"నువ్వలా అంటే నేనేం చెప్పగలను?''

"మీవి దొంగమాటలు కావులెండి''

"పోనీగానీ నేను తరచూ నీ బుగ్గలు ముట్టుకుంటున్నానని కోపమా?''

"ఛా''

ఆమె ఛా అనడంలో అతను పరిపూర్ణానందమును పొందాడు. వారి ముద్దు సంభాషణ రమాదేవి చెవులకు విందుగొల్పింది.

"భాను బుగ్గలమీద నీకింత ముచ్చటగా వున్నప్పుడు నువ్వు దానిని పెళ్లి చేసుకోరాదా భాస్కరం. ఈ కార్యంవల్ల నువ్వు మమ్మల్ని రక్షించినవాడవూ అవుతావు, భగవంతుడ్ని మెప్పించినవాడవూ అవుతావు'' అని రమాదేవి నవ్వుతూ అంటూ వుంటే భాను సిగ్గుతో తలను కిందకు దించుకుని దొంగతనంగా భాస్కరం ముఖంలోకి చూస్తూ ఉంది. భాస్కరం రమాదేవి అన్నదానికేమీ సమాధానం చెప్పకుండా ఓ చిరునవ్వు నవ్వేసి ఊరుకున్నాడు.

"గాకపోయినా మాలాంటి బీదవాళ్లను చేసుకుంటావా ఏమిటి నాయనా నువ్వు?''

"అన్నీ మీరే అంటూ ఉంటే ఇక నేనెందుకు మాటలాడడం?''

"ఈ మాటనే ఇదివరకోసారి మీ నాన్నగారి దగ్గర, మీ అమ్మగారి దగ్గర అంటే చెప్పు తీసుకుని కొట్టినట్లుగా సమాధానం చెప్పారు.''

"విన్నాను. నేనూ అన్నీ విన్నాను.''

"అయినప్పటికీ నీ విశాల హృదయమును తెలుసుకుని ఉండడంవల్ల తిరిగి ఆ మాటను నీ దగ్గర అనలేకుండా ఉండలేకపోయినాను''

"ఏమిటో మీరింకా దొడ్డిదారినే వున్నారు. భానుకూ నాకూ ఇంతకు ముందే పెళ్లి అయిపోయింది. లేకపోయినట్లయితే పెళ్లికాని పడుచుపిల్లతో బుగ్గలు పట్టుకుని సరసమాడతానా?'' అని అతడు అంటూ వుంటే రమాదేవి కళ్లు ఆనందంతో మెరిసిపోయినాయి. హృదయం సంతోషంతో నిండిపోయింది.

"అవును నాయనా... నువ్వంతటి ఉదారగుణ సంపన్నుడవే అవుదువు.''

"నేను చెప్పిన మాట అబద్ధమేమో మీ భానునే అడగండి'' అని అతడు అంటూ వుంటే అంతవరకూ భాస్కరానికి చేరువగా కూర్చునివున్న భాను సిగ్గుతో తల్లిదగ్గరకు పరుగెత్తుకునిపోయింది.

"మీ నాన్నగారి వంట్లో ఎలా వుంది భాస్కరం?''

"చాలా ఎక్కువగా ఉంది. ఇంతకూ డాక్టర్ చలపతిరావే కారకుడు''

"అదేం?"

"జైలుకు వెళ్లడము తప్పించుకుందామని మా నాన్నగారు జబ్బు చేసిందన్న దొంగ వేషంతో మంచమెక్కారు. ఏ జబ్బూ లేకుండా మామూలుగా రెండు పూటలా తింటూ మంచమెక్కి కూర్చుంటే ఏమవుతుంది? సరదాకు తెచ్చి పెట్టుకున్న జబ్బు నిజమయింది. క్రమంగా అజీర్ణరోగంలోకి దింపింది. అందువల్ల డాక్టర్ చలపతిరావుగారి దగ్గర వైద్యం ప్రారంభించారు."

"అంతవరకూ బాగానే వుందనుకుందాము"

"అజీర్తి రోగం ఎన్నాళ్లల్లో పోతుందీ, రెండురోజులు తప్పితే ఇంకో రెండురోజులు. మొదట అతను కూడా అలాగునే చెప్పి మందిచ్చాడు."

"ఆ!"

"జబ్బు ఎక్కువయితే ఇంకా చాలాకాలం వైద్యం చేయించుకుంటారనీ, తనకు ఎక్కువ బిల్లు వస్తుందని ఆలోచించి అతడు జబ్బు ఎక్కువవడానికి మందిచ్చాడు."

"సరి"

"విషమే ఇచ్చాడో, పాషాణమే ఇచ్చాడో...అతనిచ్చిన ఔషధం గుండెల మీద చాలా దారుణంగా పని చేసింది. ఏ క్షణానికా క్షణమే గుండె ఆగిపోతుందేమోనని భయపడుతున్నాము."

"మంచి వైద్యుడే. కొంపదీసి నాక్కూడా అలా చేసాడుగాడు. ఈ దిక్కు లేని స్థితికి తోడింకా చచ్చిపోదును"

"మీకలా ఎందుకు చేస్తాడు? డబ్బులేనివారనీ, బిల్లు ఇచ్చుకోలేరనీ తెలుసుగా"

"అవును. అయితే అతడు మీ నాన్నగారికి చేసిన ఈ దారుణం తమకెలా తెలిసింది?"

"మొన్నటిదాకా అతని దగ్గర పని చేసే కాంపౌండరు చలపతిరావుతో ఎందుకో పేచీపడి మానేసాడు. అతడు చెప్పాడీ రహస్యమంతాను. మా నాన్నగారొక్క విషయంలోనే కాకుండా తన చేత వైద్యం చేయించుకునే శ్రీమంతులందరకూ అతడిలాగే పీడిస్తూ ఉంటాడుట. ఆ విషయమంతా మనకేం తెలుసు? ఆ కాంపౌండరు అతడిమీద ఉండే కోపంకొద్దీ గుట్టును బయట పెట్టినట్లు తెలిసింది."

"ఇప్పుడెలాగ?"

"ఎలాగేమిటి? వెంటనే అతనిని మానిపించి మరో డాక్టర్ని పెట్టాము. అతను కూడా చాలా నిరాశగానే చెబుతున్నాడు. ఏమయినా ప్రయత్నం మానలేముకదా"

"చలపతిరావు చాలా మంచి డాక్టరేనన్నమాట. మళ్లీ దేశ సేవకుడనంటూ ఖద్దరు బట్టలు కూడా ధరిస్తాడెందుకు?"

"అదో వేషం. చేసే మోసాలు కప్పిపుచ్చుకోవడానికి స్వాతంత్రం ఈ రోజుల్లో"

"బాగా చెప్పావు"

"రామచంద్రంగారిలాంటి ఉత్తమ దేశసేవకుడ్ని ఈ రోజుల్లో ఎవరూ చూడనే చూడరు. ఇదిగో... ఇటువంటి దొంగ దేశభక్తులకే ఇవిరోజులు"

"ఎంత దారుణం"

"మా నాన్నగారి నడక సరైనదయితే ఇలా ఎందుకొస్తుందిలెండి. కాంగ్రెస్ పేరు చెప్పి, దేశసేవ పేరుచెప్పి ఆయన గావించిన మోసాలనందరూ చాటుగుండా చెప్పుకుంటూనే ఉన్నారు. నాలుగు డబ్బులు చేరదీయగానే అయిపోయిందా?"


"నాయనా! ఉన్న మాటనంటూవున్నా నువ్వా తండ్రి కడుపున తప్పబుట్టావు"

"తండ్రికదా అని చేసిన తప్పుడు కార్యాలను నేను కప్పెడితే లోకం కప్పెడుతుందా?"

"నీ కడుపు చల్లగా...నూరేళ్లు వర్ధిల్లు నాయనా"


"ఇంతకూ ఎవరు చేసుకున్న ఖర్మను వారే జన్మలోనే అనుభవిస్తారు"

"అంతేమరి. అన్నట్లు అడగడం మర్చిపోయాను. నీకు నిశ్చయమయిన తాహసీల్దారుగారమ్మాయికి వివాహమయిపోయిందే"



## హృతిక్ కోరిక!

'కైట్స్' చిత్ర పరాజయం హృతిక్‌రోషన్‌ను కృంగదీసిందనే చెప్పొచ్చు. ప్రస్తుతం హృతిక్ ఆశలన్నీ తాజా చిత్రం 'గుజారిష్'పైనే వున్నాయి. ఈమధ్యనే రజనీ 'రోబో'ను చూసిన హృతిక్, దర్శకుడు శంకర్‌కి ఫోన్ చేసి కంగ్రాట్స్ చెప్పాడట. రోబోను అద్భుతంగా తీసినందుకు శంకర్‌ను ప్రశంసలతో ముంచెత్తాడుట. శంకర్ దర్శకత్వంలో తాను నటించాలనే కోరికను ఈ సందర్భంగా వ్యక్తం చేసినట్లుగా చెబుతున్నారు. క్రేజీ దర్శకుని దర్శకత్వంలో క్రేజీ హీరో నటిస్తే ప్రేక్షకులకు అంతకన్నా కావాల్సిందేముంది!



"అవును. అయిపోయింది. మా నాన్నగారి ఆరోగ్యం చెడిపోవడంవల్ల పెళ్లి అపుచేసామన్నారు. తాహసీల్దారుగారు కూతురు పెళ్లిని ఆపుచేయడానికి ఇష్టపడకపోవడంవల్ల వెంటనే మరో సంబంధం చూసుకున పెళ్లి చేసేసారు. ఇంతకూ నాకు మీ భాను భార్య కావలసి ఉండగా తాహసీల్దారుగారమ్మాయి ఎలా అవుతుంది?"

"ఇంతకూ నీ దయ ఉంటే నా తల్లి గొప్ప అదృష్టవంతురాలవుతుంది. ఆమె నోచిన నోము గొప్పదవుతుంది. మా కడుపునబుట్టి అది చిన్నప్పటి నుంచీ కూడా ఏమీ సుఖపడలేదు. భాస్కరం! అది పుట్టినప్పటినుంచీ మాకొకటే ఇబ్బంది. లక్ష రూపాయల ఆస్తికి రెక్కలురావడమే కాదు, తండ్రి ప్లీడరీ వృత్తిని మానేసి తరచు జైల్లోకి వెడుతూ ఉండడమే కాదు, అనేక కష్టాలు, ఇంతవరకూ వదల్లేదు. ఇకముందైనా దయామయుడవయిన నీమూలంగా మా కష్టాలన్నీ మబ్బు విడిపోయినట్లు విడిపోతాయని ఆశిస్తున్నాను."

"అన్నట్లు ఇంకో ముఖ్యమైన విషయం గురించి మీతో చెప్పడం మరచిపోయానండోయ్"

"ఏమిటి నాయనా"

"సంతోష వార్త" అని అతడంటూ ఉంటే భాను అతని కళ్లల్లోకి ఆశగా చూస్తోంది.

"నీకో శుభవర్తమానం చెబుతాను. నాకేమిస్తావు భానూ?" అని భాస్కరం భానుమతిని చిరునవ్వు ముఖంతో అడిగాడు.

"చెప్పండి. మీకేది కావాలంటే అదే ఇస్తాను" అని భాను పమిట చెంగును మెలిపెడుతూ అంది.

"ఈవేళ పేపర్లో చూసాను. గాంధీగారికి గవర్నమెంటుకూ రాజీ కుదిరింది. అందువల్ల రాజకీయ ఖైదీలందరనూ త్వరలో విడుదల చేసేస్తారు. మీ నాన్నగారూ వస్తారు. ఈ కబురు చెప్పినందుకు లంచమేమిటో తెలుసా?"

"అమ్మా! ఈవేళ ఎటువంటి శుభవార్తను విన్నామూ"

"ఆ వార్తను తెచ్చిన భాస్కరానికి లంచములు ఇయ్యి"

"ఏది కావాలంటే అదే ఇస్తానని ఇంతకుముందే చెప్పానుగా" అని భాను అంటూ ఉండగా-

"నాకు నువ్వే కావాలి" అని భాస్కరం అన్నాడు.

"తీసుకోండి" అని అంటూ భాను తల్లి దగ్గరనుంచి భాస్కరమున్న దగ్గరకు వెళ్లి కూర్చుంది.

"మూడు సంవత్సరాల కఠిన నరకమనుభవించవలసిన మీ నాన్నగారింకా మూడు మాసాలయినా గడవకుండా వచ్చేస్తారు అంటే ఏమన్నామాట?"

"మన అదృష్టం బాగుండబట్టి గాంధీగారికి, గవర్నమెంటుకూ రాజీ కుదిరింది. ఇక నాన్నగారు రాకేం చేస్తారు?"

"ఇంతకూ ఈ అదృష్టమంతా నీదే తల్లీ. అయితే భాస్కరం అలా అంటాడేమమ్మా?"

"ఏమంటున్నాడు?"

"భానుకూ నాకూ పెళ్లి ఇంతకుముందే అయిపోయిందంటున్నాడు. నాకా మాట మాత్రం అర్థం కాలేదు."

"మొన్ననోనాడు నేను పూలదండ గుచ్చుకుంటున్నానే అమ్మా. అప్పుడు భాస్కరమొచ్చి ఆ దండ నాకు కావాలన్నాడు. నేను సందేహించకుండా వెంటనే నా చేతిలోని దండను అతని మెడలో వేసాను. అందుకని అలా అన్నాడు."

"ఓ... అదా తల్లీ" అని రమాదేవి ఆనందోద్రేకంతో భానును హృదయానికి హత్తుకుంది.

***

డాక్టర్ చలపతిరావుగారి ధర్మమా అని తిరపయ్య హఠాత్తుగా గుండె ఆగిపోయి దివంగతుడయినాడు. అతని అవసాన కాలంలో భాస్కరం కబురు చేయడంవల్ల భానుమతీ, తల్లీ కూడా ఆ సమయంలో వెళ్లి అక్కడనే ఉన్నారు. తిరపయ్యకు దహనక్రియలు జరిగింపబడిన అనంతరం రమాదేవి కూతురుతో తిరిగి తన ఇంటికి వెళ్లిపోయింది.

కానీ భాస్కరం అందుకు సమ్మతించకుండా వారిని నిర్బంధంచేసి తన ఇంటి దగ్గరనే ఆపుచేసాడు. ఒకనాటి రాత్రి రమాదేవి ఏడకు కింది భాగంలో పడుకుని నిద్దరపోతూ వుంది. పైన భాస్కరం తల్లి ఈ విధంగా మాట్లాడుకోవడం మొదలుపెట్టారు.

"నాయనా భాస్కరం! ఇంటి యజమాని ఎలాగూ పోనేపోయినారు. ఇకనైనా నువ్వొక ఇంటివాడవయితే నా హృదయం శాంతిని పొందుతుంది. కోడలూ నువ్వూ నా కళ్ల ఎదుట మసలుతూ ఉంటే నా నాయనగారు పోయిన దుఃఖమును కొంతవరకు మరచిపోతాను"

"నీ కోడలు నీ ఇంట్లోనే ఉందిగదా...నీకెందుకమ్మా ఇక జిజ్ఞాస" అని కొడుకు అడుగుతున్న ప్రశ్న యొక్క భావమును ఆ తల్లి గ్రహించుకోలేకపోయింది.

"నీ అభిప్రాయమును నేను తెలుసుకోలేకుండా ఉన్నానురా"

తరువాత భాస్కరం ఈ విధంగా చెప్పడం మొదలుపెట్టాడు.

"అమ్మా! వారి స్థితిగతులు పేదవవుతే ఆ పిల్ల పేదదిగాదుకదా. భాను రత్నంలాంటి పిల్ల."

"అందుకు నేనూ ఒప్పుకున్నాను"

"అంతేకాకుండా ఆమెమీద నిలిచిపోయిన నా మనసు మరియొకరిమీదకు పోదు"

"ఇంకెందుకు నాయనా నాకు సర్వమూ అర్థమైపోయిందిగా. మీ ఇరువురూ భార్యాభర్తలుకావడానికి నేనిప్పుడు సంతోషంతో అంగీకరిస్తున్నాను. మా బ్రతుకంతా నీకు సంతోషమును కూర్చడానికేకదా నాయనా. రామచంద్రంగారు వచ్చిన వెంటనే ఈ శుభకార్యం జరిగే ఏర్పాటు చేయి నాయనా. మీ నాన్నగారు పోయినారు కదా! ఇహ నాకెప్పుడు ఆహ్వానం వస్తుందో ఎవరు చెప్పగలరు? నేను ఉన్నా లేకపోయినా నీకు చెప్పేది ఒకటే మాట. దానినే ఎప్పటికీ మనసులో వుంచుకో. దేశసేవ అనీ, ప్రజాక్షేమమనీ, ఉన్న స్థితినంతటినీ రామచంద్రంగారిలాగున పాడు చేసుకోకు. నీకు లేని స్థితి వచ్చిందంటే ఏ దేశమూ, ఏ ప్రజలూ గోరింతయినా సాయం చేయరు. రామచంద్రంగారి కుటుంబం పడ్డ కష్టాలు కళ్లారా చూసాముకదా" అని తల్లి కొడుక్కు ఆ రాత్రి చాలాసేపటివరకు హితబోధను చేసి అతను భానుమతిని వివాహమాడడానికి సంతోషంతో అంగీకరించింది.

భర్త మరణానంతరం ఆమె హృదయంలో కొంత మార్పు కలుగకపోలేదు. బ్రతికినంతకాలము చెడ్డగా బ్రతికి చనిపోయేటప్పుడు కూడా కట్టుకుపోయేదేమీ లేదన్న విషయం ఆమె భర్త మరణంవల్ల గ్రహించుకుంది. తదనుకూలంగానే తన నడవడిని కూడా దిద్దుకుంది.

***

రామచంద్రం రాజమండ్రి సెంట్రల్ జైలులో విడుదలయ్యి అక్కడ బయలుదేరి బందరు వస్తున్నట్లుగా టెలిగ్రామొచ్చింది.

అతడు బందరు స్టేషనులో దిగేవేళకు భాస్కరం, భానుమతి, రమాదేవి

సహితంగా అలంకరింపబడిన కారులో రైలుస్టేషన్‌కు వెళ్లారు.

రామచంద్రంయొక్క ఆగమనానికి రమాదేవి, భానుమతి ఎంతగా ఆనందిస్తున్నారో, అప్పటి వారి ముఖలక్షణములను చూసినవారికేగానీ ఇత రులకు తెలియదు. నియమితకాలానికి వారనుకున్న రైలు బందరు ప్లాట్‌ఫా రంమీదకు వచ్చి నిలిచింది. తనవారు తనకోసం స్టేషన్‌కు వస్తారని రామ చంద్రానికేం తెలుసు?

భాను ఎలా వుందో? రమాదేవి ఎలా ఉందో? అన్న ఆదుర్దాతో అతడు పిచ్చివానిలాగా రైలు దిగీ దిగడంతోనే వడివడిగా గేటు వైపు నడిచిపోతూ ఉండడం ముందుగా భానుమతి చూసింది.

"నాన్నగారూ! నాన్నగారూ" అని అతని వెనకాల పరుగెత్తింది.

కొంతసేపటికిగానీ రామచంద్రానికి పిలుపు అందలేదు. తరువాత అత డిట్టే వెనుదిరిగి చూడగా భార్య, తిరపయ్యగారబ్బాయి, భానుమతి అతని కళ్లబడ్డారు. భార్యను, బిడ్డను చూసుకోగానే రామచంద్రానికి ప్రాణం లేచి వచ్చినట్లుగా అయింది. అయితే అక్కడకు భాస్కరం కూడా ఎందుకు వస్తాడా అని సందేహించాడు.

చాలాకాలం క్రిందట అతను భాస్కరాన్ని చూసి ఉండడంవల్ల ఒకవేళ అతడు తిరపయ్యగారబ్బాయిగాక మరెవరో అయి ఉంటాడని నిశ్చయం చేసుకుని తనకెదురుగా పరుగెత్తి వస్తున్న భానుని కౌగలించుకుని ఆనంద భాష్పాలు రాలుస్తూ భార్య, భాస్కరము నిలుచున్న తావుకు వచ్చాడు.

రమాదేవి భర్త కుశలమునడిగి అతని టెలిగ్రాము సకాలంలో అందడం వల్ల స్టేషన్‌కువచ్చి కలుసుకోగలిగినట్లుగా చెప్పింది. అంతకుముందె ప్పుడూ భాస్కరం రామచంద్రంతో మాటలాడి ఉండలేదు. అందువల్ల తానే ముందుగా కల్పించుకుని ఆ దేశభక్తునితో మాటలాడడమెలాగునా అని అతడు ఆలోచిస్తూ ఉండగా రామచంద్రం భార్య వైపు తిరిగి-

"వీరెవరు?" అని అడిగాడు.

"తిరపయ్యగారబ్బాయి. మీకు కాబోయే అల్లుడు" అని ఆమె ఆనందో ద్రేకంతో అనగా-

"ఇతడు భాస్కరమా?" అని ఆశ్చర్యపోతూ అతనివైపుచూసాడు.

"నమస్కారం పంతులుగారూ" అని రామచంద్రానికి భాస్కరం నమ స్కారం చేసాడు.

"నువ్వెప్పుడూ మదరాసులోనే ఉంటూ ఉండడంవల్ల నిన్నెప్పుడూ బాగా చూడలేదు. ఎప్పుడో అయిదారు సంవత్సరాలక్రితం నువ్వెప్పుడో సెలవుల్లో ఇక్కడికి వచ్చినప్పుడు చూసాను. కానీ బాగా గుర్తులేదు. అయి నప్పటికీ మొదట నువ్వు తిరపయ్యగారబ్బాయివేమోనని అనుమానిం చాను సుమీ. అయితే మావాళ్లతో నువ్వు కూడా ఎందుకొస్తావనుకున్నాను. మీ నాన్నగారు క్షేమమా?" అని రామచంద్రం అనగా-

"వారు దివంగతులయినారులెండి" అని భాస్కరం చెప్పాడు.

"అదెప్పుడూ?" అడిగాడు రామచంద్రం నిలువునా నీరయి.

"రెండుమాసాలయింది" అని భాస్కరం చెబుతూ ఉండగా-

"వారి ప్రాణాలు డాక్టర్ చలపతిరావుగారి మూలంగానే పోయినాయి. అంతా స్థిమితంగా తెలుసుకొందరుగానీ పదండి" అని రమాదేవి అన్నది.

"నాన్నగారూ! మీరు లేని సమయంలో వీరు సాయం చేయకపోయిన ట్లయితే అమ్మా, నేను ఈపాటికేమయిపోయేవాళ్లమో?" అని భాను తండ్రి ఆనందోద్రేకంతో చెప్పింది.

"మా ఆపదలకడ్డుపడడానికి భగవంతుడే ఈ రూపంలో అవతరిం చాడా అనుకున్నాము. ఇతడు తిరపయ్యగారి కడుపున పుట్టవలసిన కొడుకు కాదు" అని రమాదేవి కూడా భాస్కరమును గురించి భర్తకు క్లుప్తంగా తెలిపింది.

"అలాగా నాయనా! నువ్వు చిన్నవాడవయినప్పటికీ కృతజ్ఞతతో నమ స్కారం చేస్తున్నాను" అని రామచంద్రం భాస్కరానికి నమస్కారం చేయ బోతూ ఉండగా అప్పుడు రామచంద్రంగారి చేతులు పట్టుకుని-

"తప్పు పంతులుగారూ! మీరు పెద్దలు. విశేషించి దేశంకోసం సర్వశక్తు లనూ ధారపోసుకున్న త్యాగధనులు. మాలాంటివారివల్ల మీరు వందన ములు అందుకోవలసినవారు" అని వాదించాడు.

"ఇప్పుడీతని తల్లిగారు కూడా మన భానును భాస్కరానికి చేసుకోవడా నికి సంతోషంతో అంగీకరించి మీరు విడుదల అవుతారన్న విషయమును తెలుసుకోగానే ముహూర్తం నిశ్చయం కూడా చేయించి మీ ఆగమనాన్నే నిరీక్షిస్తూ ఉంది" అని రమాదేవి భర్తకు చెప్పగా అతడు పట్టలేని ఆనంద మును పొందాడు.

"ఇంతకంటే మనం కోరుకోవలసింది ఏమీలేదు" అని రామచంద్రం ఆనందభాష్పాలు రాల్చి కూతురునూ, కానున్న అల్లుణ్ని దగ్గరగా చేరదీసు కున్నాడు.

"రైలు వెళ్లిపోయింది. మీతో దిగివచ్చిన ప్రయాణికులందరూ వెళ్లిపో యినారు. మనం ప్లాటుఫారంమీద నుంచి కదలొద్దా ఏమిటి నాన్నగారూ" అని భాను అనగా-

"బయట కారు వేచి ఉంది. పోదాం పదండి" అని భాస్కరం అన్నాడు.

"ఏమిటో ఈ ఆనందోద్రేకంతో కాలమును కూడా మరచిపోయినాను. పదండి" అని రామచంద్రం అనగా అందరూ ప్లాటుఫారమును దాటి ఇవ తలకు వచ్చారు. అక్కడ అలంకరించబడిన కారు, బ్యాండు మేళము సిద్ధ ముగా ఉన్నాయి. భాస్కరం తన గురించి ఏర్పరచిన ఆ అట్టహాసమునకు రామచంద్రంగారు లోలోపలనే ఆనందించారు.

ముందు కారులో రామచంద్రంగారు ఎక్కారు. ఆ తరువాత భాను ఎక్కబోతూ ఉండగా రమాదేవి వారించి-

"ఉండు తల్లీ! మీ దంపతులు ఇద్దరూ ఒక సీటులోనూ, మా దంపతుల మిద్దరమూ ఒక సీటులోనూ కూర్చోవాలి" అని తాను భర్త పక్కగా కూర్చుంది. తరువాత వెనుక సీటులో భాస్కరం ఎక్కి కూర్చుని, సందే హిస్తూ సిగ్గుతో నిలుచున్న భాను చేయి పట్టుకుని లాగి తన ప్రక్కగా కూర్చోబెట్టుకున్నాడు.

బాజాభజంత్రీలతో అలంకరింపబడిన కారులో వూరేగుతూ వెడుతూ ఉంటే చూసినవారదే భానుమతీ భాస్కరముల వివాహ మహోత్సవము అనుకున్నారు.

**(అయిపోయింది)**

